**ఎడ్యుకేషన్ వీక్‌లో భాగంగా కేజీసీఏలో అవగాహన ఒప్పందాలు..**




# PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

**ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పరకాలలో ఘనంగా విద్యా వారోత్సవాలు ప్రారంభం**




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 135 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 12 మే 2026


## అభివృద్ధికి కేంద్ర సహకారం
# తప్పనిసరి




- రాష్ట్రాన్ని అభివృద్ధిలోకి తీసుకు వెళతామని మోదీ అన్నారు
- రాష్ట్ర ప్రాజెక్టుకు అనుమతులను మాత్రమే కోరాం
- రాష్ట్రప్రయోజనాల కోసమే నా పోరాటం
- బిజెపిని ఓడించి సిఎం అయిన వ్యక్తిని నేను
- బిజెపి అంటే..బ్రిటిష్ జనతా పార్టీ
- విభజించు పాలించడం బిజెపి రాజకీయం
- సర్ పేరుతో రాష్ట్రాల్లో చొరబడే యత్నం
- జెమిని సర్కస్‌లా బిజెపి ఎన్నికల విధానం
- మోడీ పాలనాను భవ రాహిత్యంతో దేశానికి నష్టం
- మీడియాతో సిఎం రేవంత్ రెడ్డి

## తమిళనాడు సిఎం విజయ్
# ఆదర్శం

● స్టాలిన్, వైకోల ఇంటికి వెళ్లి వారితో భేటీ ● మర్యాదపూర్వకంగా కలుసుకున్న సిఎం ● ఎమ్మెల్యేగా సోమవారం అసెంబ్లీలో ప్రమాణం



**చెన్నై, మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** తమిళనాడు కొత్త సీఎం విజయ్ – మాజీ సీఎం ఎంకే స్టాలిన్‌తో భేటీ అయ్యారు. టీవీకే చీఫ్ సోమవారం డీఎంకే అధినేత నివాసానికి వెళ్లి కలిశారు. స్టాలిన్ నివాసంలో జరిగిన ఈ భేటీలో మాజీ ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొన్నారు. ఈ నేతలు రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. రాష్ట్ర ఖజానాను గత డీఎంకే ప్రభుత్వం ఖాళీ చేసిందని ఇప్పటికే విజయ్ ఆరోపించారు. దీనికి స్టాలిన్ కూడా బదులిచ్చారు. అప్పులు పరిమితికి లోబడే ఉన్నాయన్నారు. కొవిడ్ లాంటి విపత్తును ఎదుర్కొని, నిధులు ఇవ్వడంలో అడ్డంకులు సృష్టించిన భాజపాను తట్టుకుని దీటుగా నిలబడ్డామని తెలిపారు. ఈ నేపథ్యంలో వీరిద్దరు సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించు కుంది. టీవీకే విజయ్ నేతృత్వంలో ఆదివారం తమిళనాడులో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. మే 13న ఈ ప్రభుత్వం అసెంబ్లీలో బలపరీక్ష ఎదుర్కోనుంది. మరోవైపు నేడు కొత్తగా ఎన్నికైన మిగతా2లో...

## గుప్తనిధుల కోసమే ఆలయం కూల్చివేత

- రేవంత్ డైరెక్షన్‌లోనే కూల్చివేతలు
- కూల్చిన ఆలయం వద్ద పరిశీలించిన హరీష్ రావు



**వరంగల్,మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** లంకెబిందెల కోసమే పురాతమైన ఆలయాలను కూల్చివేస్తున్నారని, సీఎం రేవంత్ రెడ్డికి కూల్చడం తప్ప కట్టడం రాదని శాసనసభ విపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. వరంగల్ జిల్లా ఖానపురం మండలం అశోక్ నగర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేసిన 800 ఏండ్ల చారిత్రక మిగతా2లో...

## రాష్ట్రానికి వచ్చి సుద్దులు చెప్పిన ప్రధాని

● అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా మాటలెందుకు..? ● ప్రధాని పర్యటనపై మంత్రి పొన్నం వ్యాఖ్యలు



**హైదరాబాద్,మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధానమంత్రి మోదీ తెలంగాణకు వచ్చి అభివృద్ధికి నిధులేమీ ఇవ్వకుండా పెట్రోల్, బంగారం, వంట నూనె వాడవద్దని చెప్పి వెళ్లారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. తెలంగాణకు ప్రధాని వస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందని ప్రజలు ఆశించారని, కానీ అభివృద్ధికి నిధులేమీ ప్రకటించకుండా పెట్రోల్, డీజిల్ వాడవద్దు.. బంగారం కొనవద్దు.. వంట నూనె వాడవద్దు అని చెప్పడం ప్రధాని హోదాకు తగదని అన్నారు. సోమవారం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. వేలాది కార్లతో రోడ్ షో చేసిన మోదీ ప్రజలకు భరోసా ఇవ్వాల్సింది పోయి భయాందోళనలు కలిగించారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐ దర్యాప్తు చేయాలని భాజపా నేతలు గతంలో డిమాండ్ చేశారని, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం మిగతా2లో...

## మే నెలాఖరుకు 3 లక్షల మెట్రిక్ టన్నుల
# యూరియా బఫర్ స్టాక్

- రామగుండం ఎరువుల కర్మాగారం నుండి 90 శాతం సరఫరా చేయాలి
- రైతులకు నానో యూరియాపై కంపెనీలు కూడా అవగాహన కల్పించాలి
- రాష్ట్ర ఫెర్టిలైజర్ యాప్ మార్గదర్శకంగా కేంద్రం సరికొత్త యాప్
- ఎరువుల కంపెనీల ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమీక్ష



**హైదరాబాద్,మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** జూన్ మొదటి వారంలో రాష్ట్రంలో వరి నాట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున, మే నెలాఖరు నాటికి కనీసం 3.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. కేంద్రం నుంచి రావాల్సిన మిగిలిన యూరియాను అత్యవసరంగా రాష్ట్రానికి తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా సరఫరా, నిల్వలు మరియు నానో యూరియా వినియోగంపై వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత / జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం మిగతా2లో...

## గవర్నర్‌ను కలిసిన సిఎం రేవంత్




## గోదావరి పుష్కరాల్లోపు పోలవరం
# పూర్తి చేయండి

- పోలవరం పెండింగ్ అంశాలను పరిష్కరించండి
- తొలిదశ నిర్మాణాలను పూర్తి చేయడానికి సహకరించండి
- కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌ను కోరిన సిఎం చంద్రబాబు



**న్యూఢిల్లీ, మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** పోలవరం ప్రాజెక్టులో కీలకమైన అంశాలను పరిష్కరించాలని కోరుతూ కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. 2027 గోదావరి పుష్కరాల్లోపు ప్రతిష్ఠాత్మక పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని కోరారు. చంద్రబాబు నాయుడు సోమవారం ఢిల్లీలో పర్యటించారు. మిగతా2లో...

## రాష్ట్రంలో పెట్టుబడుల
# ఆకర్షణకు కృషి

- పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ఆస్తకి
- పరిశ్రమల శాఖ అధికారులతో సిఎస్ సమీక్ష



**హైదరాబాద్, మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రైజింగ్ -2047 విజన్ లో భాగంగా రాష్ట్రంలో భారీ పెట్టుబడులను ఆకర్షించ డానికి పరిశ్రమలశాఖ అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి. ఆదేశాల మేరకు పరిశ్రమలశాఖ అధికారులతో, ప్రాజెక్ట్ కన్‌స్టలెంట్లతో సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో పరిశ్రమలశాఖపై మిగతా2లో...

## బండి కుమారుడి కేసుపై
# సిఎం సీరియస్

- విచారణకు డిజిపిని ఆదేశించిన రేవంత్
- సిట్ ఏర్పాటు చేస్తూ డిజిపి ఉత్తర్వులు







## కార్మికుల సంక్షేమమే మా లక్ష్యం

- కనీస వేతన సవరణపై సబ్‌కమిటీ భేటీలో భట్టి

# అభివృద్ధికి కేంద్ర సహకారం తప్పనిసరి

**హైదరాబాద్, మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం తప్పనిసరి అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కేంద్ర సహకారం అవసరమని తెలిపారు. అభివృద్ధి విషయంలో కలిసి పనిచేద్దామని ప్రధాని చెప్పారని.. తమ మధ్య జరిగిన చర్చ పూర్తిగా అభివృద్ధికి సంబంధించినదేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.తెలంగాణ హక్కుల కోసం తాము కేంద్రంతో పోరాడుతామని కూడా వ్యాఖ్యానించారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ చిట్‌చాట్‌లో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ విధానాలు, రాష్ట్ర అభివృద్ధి, మావోయిస్టుల సరెండర్‌లు, మహిళా రిజర్వేషన్లు, రీజినల్ రింగ్ రోడ్, బండి భగీరథ్ కేసు వంటి అనేక కీలక అంశాలపై స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం హెచ్ఐసీసీలో పలు అభివృద్ధి పనులను ప్రారంభిం చారు. హెచ్ఐసీసీలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రధాని మోదీతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాను ప్రస్తావించిన అభివృద్ధి అంశాలను ప్రధాని మోదీ అంగీకరించారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర సహకారం అవసరమని, అదే విషయాన్ని మోదీ దృష్టికి తాను తీసుకెళ్లానని చెప్పుకొచ్చారు. 'నేను బీజేపీని ఓడించిన ముఖ్యమంత్రిని... కానీ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిందే' అని వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం కేంద్రాన్ని నిధులు అడగలేదని, తాము మాత్రం తెలంగాణ హక్కుల కోసం అడుగు తున్నామని పేర్కొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ప్రధాని మోదీ సమావేశం కావడం ప్రైవేట్ కార్యక్రమమని చెప్పుకొచ్చారు. అలాగే తమతో కలిసి రావాలన్న ప్రధాని మోదీ పిలుపును స్వాగతిస్తున్నామని తెలిపారు. ప్రధాని అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నానని, ఆయన పిలుపులో రాజకీయాలకు తావులేదని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమంలో కేంద్రంతో కలిసి వెళ్లేందుకు తనకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. వికసిత్ భారత్‌లాగే విజన్ 2047 సాధనకు, 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ అందుకునేందుకు కేంద్రంతో కలిసి నడుస్తామన్నారు. కేంద్రం, రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణితో ముందుకెళ్లాలని తెలిపారు. తమ పార్టీలు, ఐడియాలజీ వేరైనా.. అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తామన్నారు. ఎన్నోసార్లు కలిసినా.. కేంద్రం నుంచి ఆశించిన మద్దతు రాలేదని, 2 గంటలు సమయమిస్తే తమ ప్రణాళికలు ప్రధానికి వివరిస్తామని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టుకు కేందప్రభుత్వం 50 శాతం నిధులు ఇవ్వాలని కోరామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మెట్రో, సదరన్ పార్ట్ రీజినల్ రింగ్ రోడ్ వంటి కొన్ని ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఎయిర్‌పోర్ట్ క్లియరెన్స్‌లు, డిఫెన్స్ ల్యాండ్స్, మూసీ ప్రాజెక్టుకు ఏడీబీ నిధులు, నేషనల్ హైవేలకు అనుమతులు వచ్చినట్లు వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈ పనులు ఆలస్యమయ్యాయని ఆరోపించారు. 2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని తాను ప్రధాని మోదీని కోరగా ఆయన అంగీకరించారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీని 'బ్రిటిష్ జనతా పార్టీ'గా సీఎం రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. విభజించి పాలించడం ఆ పార్టీ సిద్ధాంతమని ఆరోపించారు. ముస్లింలు, క్రిస్టియన్లు, మావోయిస్టులు కూడా ఈ దేశ ప్రజలేనని, అందరికీ సమాన హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. బీజేపీ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వారిని ఖతం చేయడం వాళ్ల విధానమని విమర్శించారు. తమ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వారిని ఒప్పించి జనజీవనంలో కలపడం కాంగ్రెస్ విధానమని వ్యాఖ్యానించారు. విదేశీ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు.

# రాష్ట్రానికి వచ్చి సుద్దులు చెప్పిన ప్రధాని

(మొదటి పేజీ తరువాయి)

సీబీఐ విచారణకు ఆదేశించినా కేంద్రం ఎందుకు చేయడం లేదని మంత్రి ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన 12 ఏళ్లలో కేంద్రం ఏం చేసిందో చెప్పాలని సవాల్ విసిరారు. ఆర్ఆర్ఆర్ నిధులు, మెట్రో నిధులు, రేడియల్ రోడ్లు, గోదావరి పుష్కరాలకు ప్రత్యేక నిధులు సహా రాష్ట్రానికి కావాల్సిన అభివృద్ధి అంశాలపై తెలంగాణలోని 8 మంది భాజపా ఎంపీలు.. ఒక్క వినతిపత్రమైనా ఇచ్చారా? అని మంత్రి నిలదీశారు. బీసీ హక్కులు, దేవాలయాల అభివృద్ధి, క్యూర్ ఏరియా అభివృద్ధి వంటి కీలక అంశాలపై తెలంగాణ భాజపా నేతలు మాట్లాడటం లేదని మంత్రి విమర్శించారు. రాహుల్ సూచనలతో తెలంగాణలో కులగణన నిర్వహించామని, జనగణనలో బీసీ కులాల వివరాలు చేర్చాలని కేంద్రాన్ని కోరినా మోదీ సర్కార్ స్పందించడం లేదని మంత్రి పొన్నం ఆరోపించారు. బండి సంజయ్ కుమారుడిపై వచ్చిన ఆరోపణల విషయంలో కేంద్ర మంత్రి హోదా ఉపయోగించి విచారణ అడ్డుకోవద్దన్నారు. విచారణ నిష్పక్షపాతంగా జరగాలని, దోషులకు శిక్ష తప్పదని స్పష్టం చేశారు.

# గోదావరి పుష్కరాల్లోపు పోలవరం పూర్తి చేయండి

(మొదటి పేజీ తరువాయి)

పలు కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. అలాగే, పలువురు కేంద్రమంత్రులను కలిసి ఏపీకి సంబంధించిన అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి చర్చించారు. ఈ క్రమంలోనే సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు. తొలిదశలో 41.15 మీటర్ల మేర నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే తాను స్వయంగా ఐదుసార్లు ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షించి నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. 2026 ఏప్రిల్ 2వ తేదీ నాటికి కొత్త డయాఫ్రామ్ వాల్ నిర్మాణం పూర్తి అయ్యిందని, గ్యాప్ 1, గ్యాప్ 2లలో కీలకమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనులు కూడా వేగంగా జరుగు తున్నాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ప్రజాభిప్రాయ సేకరణ పెండింగ్ లో ఉందనే కారణంతో 2011లో ఇచ్చిన స్టాప్ వర్క్ ఆర్డర్ ఉత్తర్వులను శాశ్వతంగా ఉపసంహరించు కోవాలని కేంద్ర జలశక్తి మంత్రిని సీఎం చంద్రబాబు కోరారు. దీనివల్ల పోలవరం ప్రాజెక్టు పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా చేపట్టేందుకు వీలవుతుందని స్పష్టం చేశారు. సాగునీటి అవసరాల దృష్ట్యా మొదట నిర్ణయించిన దానికంటే కుడి, ఎడమ కాలువల సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కులకు పెంచినట్లు వివరించారు. ప్రస్తుతం కుడి కాలువ 95 శాతం మేర.. ఎడమ కాలువ పనులు 78 శాతం మేర పూర్తి అయ్యాయని తెలిపారు. కాలువల సామర్థ్యం పెంచిన మేరకు నిధులను రీయింబర్స్ చేయాలని జలశక్తి శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు తదుపరి పనులకు సంబంధించి అవసరమైన నిధులను కూడా మంజూరు చేయాలని కేంద్రమంత్రిని సీఎం చంద్రబాబు కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృషి సీంచాయి యోజన కింద ఏపీలోని వివిధ పథకాల పునరుద్ధరణ, ఆధునికీకరణకు నిధులు మంజూరు కోరుతూ లేఖ ఇచ్చారు. హర్ ఖేత్ కో పానీ కార్యక్రమంలో భాగంగా చెరువులు, కుంటల మరమ్మతులు, పునరుద్ధరణ ,ఆధునికీకరణ, కాలువల పూడిక తీత, గట్ల బలోపేతం లాంటి పనులు చేయాల్సి ఉందన్నారు. ఏపీ వ్యాప్తంగా 297 నీటి వనరుల పునరుద్ధరణ కోసం రూ.285 కోట్ల నిధులను విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. సుప్రీంకోర్టు తుది తీర్పు వచ్చేంత వరకూ ఆలమట్టి ఎత్తు పెంచే అంశంపై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయొద్దని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం విజ్ఞప్తి చేశారు. ఆనకట్ట ఎత్తును 519.60 మీటర్ల నుంచి 524.256 మీటర్లకు పెంచితే ఏపీ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని.. ఎలాంటి సాంకేతిక, పాలనా పరమైన అనుమతులు మంజూరు చేయొద్దని సీఎం చంద్రబాబు సూచించారు. అప్పర్ కృష్ణా ప్రాజెక్ట్ ఫేజ్-ఎఎఎ కింద భూసేకరణ ఇతర సన్నాహక పనులు చేయకుండా కర్ణాటకను ఆదేశించాలని, సుప్రీంకోర్టు తుది తీర్పు వచ్చేంత వరకూ యథాతథ స్థితిని కొనసాగించాలని కోరారు. రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల దాహార్తిని తీర్చే పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. గోదావరి నుంచి సముద్రంలోకి వృథాగా పోయే 200 టీఎంసీల వరద జలాలలను మళ్లించేలా పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపడుతున్నట్లు వెల్లడించారు. వంశధారపై నేరడి బ్యారేజ్ నిర్మాణానికి జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ముందుకు వెళ్తామని చెప్పుకొచ్చారు. ఏపీ నీటి అవసరాలకు అనుగుణంగా 8 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో కుడివైపున హెడ్ స్లూయిస్ నిర్మాణం చేపడతామని తెలిపారు. దీనికి అవసరమైన భూసేకరణ కోసం ఒడిశాను ఆదేశించాల్సిందిగా జలశక్తి శాఖ మంత్రిని సీఎం చంద్రబాబు కోరారు.

# రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్శణకు కృషి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన సమీక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి వివిధ రాష్ట్రాల పారిశ్రామికవేత్తలు ఆస్తకి చూపుతున్నారని, ఆ దిశలో పరిశ్రమలశాఖ అధికార యంత్రాంగం సమాయత్తం కావాల్సిన అవసరం ఉందని, తగు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకొని పారిశ్రామికవేత్తలతో సమన్వయం చేసుకోవాలని ఆయన సూచించారు. ఎం.ఒ.యు.లతోపాటు పెట్టుబడి దారులకు అవసరమైన ఇతర మౌలిక వసతులను సమకూర్చాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పథకాలతోపాటు ఆయా రంగాలలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను కూడా పెట్టుబడుదారులకు తెలియపరిచి రాష్ట్రాభివృద్ధికి తోడ్పాలని సిఎస్ తెలిపారు. భారీ పెట్టుబడులతో పాటు స్థానిక యువతకు అధిక స్థాయిలో ఉద్యోగావకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఫార్మా రంగం, చేనేత ఉత్పత్తులు, టెక్స్ టైల్ పార్కులు, ఐటి పరిశ్రమలు, డేటా సెంటర్లు, డ్రైపోర్టులు సంబంధిత రంగాల్లో పారిశ్రామికవేత్తలు భారీగా పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనబరుస్తున్నారని, తెలంగాణ రైజింగ్ -2047 విజన్ కు వారు ఆకర్షితులవుతున్నందున అధికార యంత్రాంగం కూడా తగు కార్యాచరణ ప్రణాళికతో వారిని ప్రోత్సహించాలన్నారు. అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ తదితర ఐటి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తు న్నారని అధికారులు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగం, డెయిరీ ఉత్పత్తుల రంగంలో కూడా పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో వివిధ రంగాలలో పెట్టుబడులతో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయని అధికారులు అన్నారు.

# మే నెలాఖరుకు 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్

(మొదటి పేజీ తరువాయి)

సచివాలయంలో ఎరువుల కంపెనీల ప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలో 1.46 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్‌తో పాటు సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ మరియు కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఖరీఫ్ 2026 సీజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం 11.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా, కేంద్రం 10 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించిందన్నారు. ఆ కేటాయింపుల ప్రకారం ఏప్రిల్, మే, జూన్ నెలల్లో నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నులు, జూలై మరియు ఆగస్టు నెలల్లో నెలకు 1.50 లక్షల మెట్రిక్ టన్నులు, సెప్టెంబర్‌లో 1 లక్ష మెట్రిక్ టన్నుల సరఫరా ఉంటుందని కేంద్రం తెలిపిందన్నారు. ఏప్రిల్ నెలలో కేటాయించిన 2 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 1.53 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే రాష్ట్రానికి చేరాయని, మే నెలలో ఇప్పటివరకు 48,985 మెట్రిక్ టన్నులు అందాయని అధికారులు వివరించారు. ‡రాష్ట్రంలోనే ఉన్న రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే యూరియాలో కనీసం 90 శాతం తెలంగాణ అవసరాలకే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి డిమాండ్ చేశారు. రాష్ట్ర వనరులను వినియోగించి ఇక్కడే ఉత్పత్తి జరుగుతున్న యూరియా, రాష్ట్ర రైతులకు అవసరమైన సమయంలో అందకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ అంశంపై రామగుండం ఎరువుల కర్మాగారం మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. గత నెలలో కేటాయింపుల మేరకు సరఫరా చేయని కంపెనీలు, మిగిలిన పరిమాణంతో పాటు ఈ నెల కోటాను కూడా సమయానికి సరఫరా చేయాలని మంత్రి స్పష్టం చేశారు. రేక్ పాయింట్లకు చేరిన యూరియాను జిల్లాలకు తరలించే ప్రక్రియలో ఎటువంటి జాప్యం జరగకూడదని, హ్యాండ్లింగ్ మరియు రవాణాలో నిర్లక్ష్యం కనబరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులను హోల్ సేల్ మరియు రిటైల్ లో ఎమ్మార్పి కంటే ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. రాష్ట్ర యూరియా యాప్ ను మార్గదర్శకంగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఎరువులను అందించేందుకు ఒక సరికొత్త యాప్ ను తీసుకువస్తుందని మంత్రి అన్నారు.

# తమిళనాడు సిఎం విజయ్ ఆదర్శం

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది. సిఎం విజయ్ ముందుగా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా అనూహ్య సంఘటన చోటుచేసుకుంది. నిన్న మంత్రిగా ప్రమాణం చేసిన యువనేత కీర్తన.. నేడు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయలేకపోయారు. ఎలక్షన్ సర్టిఫికేట్‌ను తీసుకురాక పోవడమే అందుకు కారణం. తర్వాత వెనక్కి వెళ్లిన ఆమె దానిని తీసుకొచ్చి, సమర్పించడంతో ఎట్టకేలకు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేశారు. ఇకపోతే సాధారణ స్థాయి నుంచి వచ్చానంటూ తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకార కార్యక్రమం నుంచి నిరాడంబరతను చాటుకుంటున్న విజయ్ వరుస ప్రశంసలు అందుకుంటున్నారు. పార్టీలకు అతీతంగా రాజకీయ ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలుస్తున్నారు. చెన్నైలోని ఎండీఎంకే చీఫ్ వైకో ను సోమవారంనాడు ఆయన నివాసానికి వెళ్లి విజయ్ కలుసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ఫోటోలు దిగారు. వైకో ఇంట్లో పనిచేసే మహిళా సిబ్బందిని సైతం ఆత్మీయంగా పలుకరించడంతో వారు ఉద్వేగానికి లోనయ్యారు. విజయ్ నిరాడంబరతకు ఇది నిదర్శనమంటూ ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. వైకో ఇంటికి వచ్చిన విజయ్‌కు ఆయన సాదర స్వాగతం పలికారు. తన కుటుంబ సభ్యులను పరిచయం చేశారు. అనంతరం తన ఇంట్లో పనిచేసే మహిళా సిబ్బందిని పరిచయం చేస్తూ, వీరంతా విజయ్‌కు పెద్ద అభిమానులనీ, విజిల్ గుర్తుకే ఓటు వేశారని చెప్పడంతో అక్కడ అహ్లాద వాతావరణం నెలకొంది. తమ అభిమాన నటుడిని అంత దగ్గరగా చూడటంతో వారు ఉద్వేగానికి లోనయ్యారు. విజయ్ సైతం ఎంతో ఆప్యాయంగా పలకరిస్తూ వారితో ఫోటోలు దిగారు. విజయ్ సాధారణ వ్యక్తిత్వం, నిరాడంబరతకు ఇది నిదర్శనమంటూ నెటిజెన్లు ఆయనపై ప్రశంసలు కురిపిస్తున్నారు. వైకో పట్ల విజయ్ సైతం తన అభిమానాన్ని చాటుకున్నారు. వైకో ప్రసంగాలు, రాజకీయ సామర్థ్యాన్ని ప్రశంసించారు. 'నేను మీ అభిమానిని' అంటూ చెప్పారు. ఎన్నికల ప్రచారంలో తొలి రాజకీయ ప్రసంగం విక్రవాండిలో చేశానని, ఆ ప్రసంగానికి ముందు తాను వైకో ప్రసంగాలను పదేపదే చూశానని తెలిపారు.

# బండి కుమారుడి కేసుపై సిఎం సీరియస్

**హైదరాబాద్, మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పై నమోదు అయిన పోక్సో కేసుపై సమగ్ర విచారణ కోసం ప్రత్యేక టీం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సోమవారం ఈ మేరకు రాష్ట్ర డీజీపీని ఆదేశించారు సీఎం. కేసులో పక్షపాత ధోరణి లేకుండా విచారణ చేయాలని.. బాధితులకు న్యాయం జరగాలని సూచించారు.హైదరాబాద్ సిటీలోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లో బీజేపీ సీనియర్ నేత, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పై పోక్సో కేసు నమోదు అయ్యింది. 17 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు బాధిత కుటుంబం కంప్లయింట్ చేసింది. మే 8వ తేదీన కంప్లయింట్ చేస్తే.. ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని డీజీపీ సీవీ ఆనంద్ ను ప్రశ్నించారు సీఎం రేవంత్ రెడ్డి. ప్రధాని మోదీ పర్యటన, భద్రతా ఏర్పాట్లలో సిబ్బంది బిజీగా ఉండటంతో ఆలస్యం అయినట్లు డీజీపీ వెల్లడించారు.

# కార్మికుల సంక్షేమమే మా లక్ష్యం

## - కనీస వేతన సవరణపై సబ్‌కమిటీ భేటీలో భట్టి

**హైదరాబాద్, మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్):**కార్మికుల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. కార్మికుల జీవన ప్రమాణాలు పెంచడమే తమ ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యమని పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్‌కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి మంత్రులు, అధికారులు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి హాజరయ్యారు. శాస్త్రీయంగా కనీస వేతనాల సవరణ చేపడతామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇతర రాష్ట్రాల కనీస వేతన విధానాలపై సమీక్షిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్ ప్రభావంపై సుదీర్ఘంగా చర్చించామని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు ఉండాలని కమిటీ సభ్యులు తెలిపారు. కేవలం అంకెల్లో కాదని.. వాస్తవ అవసరాలకు తగ్గట్టే వేతనాలు ఉండాలని చెప్పుకొచ్చారు. దేశంలో ఉత్తమ వేతన నమూనాలను తెలంగాణలో అమలు చేస్తామని భట్టి విక్రమార్క అన్నారు. కార్మికుల పక్షపాతి రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అసంఘటిత, సంఘటిత రంగ కార్మికులకు లాభం చేకూరేలా చర్యలు చేపడతామని అన్నారు. అన్నివర్గాల అభిప్రాయాలతో త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటామని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# గుప్తనిధుల కోసమే ఆలయం కూల్చివేత

(మొదటి పేజీ తరువాయి)

కాకతీయ కట్టడం శివాలయాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..గుప్త నిధుల కోసం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపించారు. స్కూల్ నిర్మాణం కోసం అయితే అర్ధరాత్రి తవ్వకాలు ఎందుకు చేపట్టారని ప్రశ్నించారు. గర్భగుడి కింద 24 అడుగుల లోతు తవ్వాకాలు చేపట్టారని పురావస్తు శాఖ తేల్చింది. ఆలయాల కూల్చివేతపై ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుంత్వం రాగానే దేవాదాయ శాఖ భూమి ప్రభుత్వ భూమిగా మారిందన్నారు. గుప్త నిధుల వేటలో ప్రభుత్వ పెద్దలు ఉన్నారన్నారు. పేదల ఇళ్లతో పాటు గుళ్లను కూల్చివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో వరంగల్ జిల్లాలో ఎన్నో ఆలయాలను పునరద్ధరించామని గుర్తు చేశారు. రామప్ప ఆలయానికి బీఆర్ఎస్ యునెస్కో గుర్తింపు తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ధ్వంసం చేసిన శివాలయాన్ని పునర్మిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సూదర్శన్ రెడ్డి, దాస్యం వినయ భాస్కర్, అరూరి రమేష్, శంకర్ నాయక్ తదితరులు ఉన్నారు.

# గవర్నర్‌ను కలిసిన సిఎం రేవంత్



**హైదరాబాద్, మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్):**రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ను లోక్ భవన్ లో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కలిసారు. జూన్ 12 న పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా విద్యార్థులతో నిర్వహించే సభకు గవర్నర్ ను ఆహ్వానించారు. విద్యార్థులు పొగాకు, మద్యం ,మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, బాధ్యతగల పౌరులుగా ప్రవర్తించాలని సభలో సామూహిక ప్రతిజ్ఞ చేయించనున్న ప్రభుత్వం. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి గతంలో సూచించిన గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా. గవర్నర్ సూచన ను గౌరవిస్తు విద్యార్థులతో భారీ సభ ఏర్పాటు చేసి యాంటీ డ్రగ్స్ ప్రతిజ్ఞ చేయించనున్నట్లు ప్రభుత్వం నిర్నయించింది. గవర్రన్‌ను సిఎం ఆహ్వానించేందుకు కలిసారు.

# ఎడ్యుకేషన్ వీక్‌లో భాగంగా కేజీసీఏలో అవగాహన ఒప్పందాలు..

### కాకతీయ గవర్నమెంట్ కళాశాల (అటానమస్), హనుమకొండ

### "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా ఎడ్యుకేషన్ వీక్ కార్యక్రమాలు





**హనుమకొండ, మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాకతీయ గవర్నమెంట్ కళాశాల (అటానమస్), హనుమకొండలో "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఎడ్యుకేషన్ వీక్ తొలి రోజు కార్యక్రమం సోమవారం (11-05-2026) ఉత్సాహభరితంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, ఇంటర్న్‌షిప్స్, అప్రెంటిస్‌షిప్స్, కెరీర్ గైడెన్స్, శిక్షణా కార్యక్రమాలు మరియు ప్లేస్‌మెంట్ అవకాశాలను పెంపొందించే లక్ష్యంతో లైఫ్ సైన్సెస్ సెక్టర్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (LSSSDC) మరియు నిర్మాణ్ ఆర్గనైజేషన్లతో అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ గారు అధ్యక్షత వహించారు. వైస్ ప్రిన్సిపాల్స్ రజని లత మేడమ్, రాజశేఖర్ సర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ శ్రీనాథ్ సర్, అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని డాక్టర్ ఎ. అనిల్ కుమార్, యుఖిజ కోఆర్డినేటర్ & ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సమన్వయం చేశారు. సంస్థల తరఫున శ్రీ యు. కుమారస్వామి, లైఫ్ సైన్సెస్ సెక్టర్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ప్రతినిధి, మరియు శ్రీ నరేష్, నిర్మాణ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి పాల్గొని విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు మరియు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన అతిథులు విద్యాసంస్థలు మరియు పరిశ్రమల మధ్య సమన్వయం అవసరాన్ని వివరించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు ప్రాయోగిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి మరియు మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని తెలిపారు. అదేవిధంగా "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా KGCA హనుమకొండ ఈ-రిసోర్సెస్ పోస్టర్ మరియు కంపెండియంను మీూజం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్ ఆవిష్కరించారు. విద్యార్థులు ఆన్‌లైన్ విద్యా వనరులను సమర్థవంతంగా వినియోగించుకొని పోటీ పరీక్షలు, నైపుణ్యాభివృద్ధి మరియు స్వయం అధ్యయనంలో ముందుకు సాగేందుకు ఈ ఈ-రిసోర్సెస్ ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. డిజిటల్ లెర్నింగ్ ద్వారా విద్యార్థుల్లో జ్ఞాన విస్తరణ, సాంకేతిక అవగాహన మరియు స్వీయ అభ్యాస సామర్థ్యాలు పెరుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చిన్నా, డాక్టర్ రవికుమార్, డాక్టర్ సమ్మయ్య, డాక్టర్ నరహరి, ఇతర అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పరకాలలో ఘనంగా విద్యా వారోత్సవాలు ప్రారంభం



**పరకాల, మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరకాలలో ఈనెల 11 నుండి 17 వరకు నిర్వహించే విద్య వారోత్సవాల ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలను మొదటగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి సంతోష్ కుమార్ సరస్వతి మాత విగ్రహానికి పూలమాల వేయగా, ముఖ్యఅతిథిగా వార్డు కౌన్సిలర్ అల్లే దశరథం హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మొదటి రోజు కళాశాలకు సంబంధించిన కరపత్రాలు, గోడపత్రికలు మరియు కళాశాల గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న ఈ-వనరుల సంకలనం లను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన దశరథం మాట్లాడుతూ పరకాల డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం ఉన్న కోర్సులతో పాటు నూతనంగా ప్రవేశపెట్టిన డైరీ సైన్స్ అండ్ టెక్నాలజీ, పౌల్ట్రీ సైన్స్ మరియు ఫిషరీస్ కోర్సులతో అద్భుతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఈ అవకాశాన్ని పరకాల మరియు పరిసర ప్రాంతంలోని విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా కళాశాలలో ఉన్నటువంటి దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ కూడా సందర్శించారు. నూతన భవనం కూడా త్వరలోనే అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈనెల 11 నుండి 17 వరకు జరిగే విద్య వారోత్సవాల కార్యక్రమాలను వివరిస్తూ ఈ సంవత్సరం కళాశాల అడ్మిషన్లను పెంచుతున్నామని అధ్యాపక బృందం అడ్మిషన్లు పెంచే దిశగా ఇంటింటి ప్రచారంలో పాల్గొంటున్నారు. అని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం అనంతరం నూతన కళాశాల భవనాన్ని కౌన్సిలర్ ఆల్లె దశరథం మరియు అధ్యాపక బృందం సందర్శించారు. అకాడమిక్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎన్. మల్లయ్య, ఐ క్యు ఏ సి కోఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణ, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఎలిషాల అశోక్ మరియు అధ్యాపకులు డాక్టర్ ఏ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ టి కల్పన, డాక్టర్ భీమ్ రావు, బి. మహేంద్రరావు, డాక్టర్ జి పావని, డాక్టర్ ఆడెపు రమేష్, ఏం సమ్మయ్య, ఆర్. ఈశ్వరయ్య, ఎస్ రాజశ్రీ, కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ జి రాజేశ్వర్ కుమార్, డాక్టర్ డి సంజయ్ కుమార్, పవన్ ,ఆఫీస్ సిబ్బంది వంశీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో మహిళలకు 33% రిజర్వేషన్లు కీలకమైన మైలురాయి

### రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి శివ నాగేశ్వరరావు





**హైదరాబాద్, మే 10(పిసిడబ్ల్యూ న్యూస్):** రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి శివ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ తీసుకువచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ సోమవారం హైదరాబాద్ , ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించారు. భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీసుకువచ్చిన చారిత్రాత్మక 'నారీ శక్తి వందన్ అధినియం' (మహిళా రిజర్వేషన్ బిల్లు) పట్ల మా 'రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే)' సంపూర్ణ మద్దతును ప్రకటిస్తోందని రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి శివ నాగేశ్వరరావు తెలిపారు. చట్టసభల్లో మహిళలకు 33% వాటా కల్పించడం అనేది దేశాభివృద్ధిలో ఒక కీలక మైలురాయి అని అన్నారు. భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కలలుకన్న మహిళా సాధికారతను నిజం చేస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం చారిత్రాత్మకమైన 'మహిళా రిజర్వేషన్ బిల్లు'ను తీసుకురావడం జరిగిందన్నారు. చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పిస్తూ మోడీ తీసుకున్న ఈ నిర్ణయం దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ పరిణామం. ఇది మహిళా లోకానికి దక్కిన గొప్ప అదృష్టంగా మా పార్టీ భావిస్తోంది. అయితే, మహిళలకు ఇంతటి గొప్ప మేలు జరుగుతుంటే, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, వారి మిత్రపక్షాలు ఈ బిల్లు పట్ల వ్యవహరించిన తీరు, వారి వ్యతిరేక వైఖరి అత్యంత విచారకరమని అన్నారు. ఇది ఆ పార్టీకి మహిళల పట్ల ఉన్న చిత్తశుద్ధి లేమిని తెలియజేస్తోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో, ఎన్డీయే భాగస్వామ్య పక్షమైన మా 'రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే)' జాతీయ అధ్యక్షులు, కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో ఈ బిల్లుకు అనుకూలంగా నిర్వహించిన ధర్నాలో శివ నాగేశ్వర రావు మాట్లాడుతూ.. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకత్వం, మహిళా బిల్లు పట్ల అవలంబించిన వ్యతిరేక విధానాలను అట్టడుగు వర్గాల ప్రజలకు, మహిళలకు తెలియజేయడమే లక్ష్యంగా, మా నాయకులు పేరం శివ నాగేశ్వరరావు గౌడ్ ఆధ్వర్యంలో ఈ నిరసన, మద్దతు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టడం జరిగింది. ఈ ధర్నా ద్వారా మహిళా రిజర్వేషన్ బిల్లు ఆవశ్యకతను, మోడీ కి మా పూర్తి మద్దతును బహిరం గంగా తెలియజేస్తున్నాము. ఈ ధర్నాకు రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ నాయకులు డాక్టర్ సంఘం శ్రీధర్, రాష్ట్ర నాయకులు దాచారపు శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డి రవికుమార్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఆర్పీ నీల, పొలిటికల్ ఉమెన్స్ అధ్యక్షులు గంగాపురం పద్మ, జగన్నాథం రాజిరెడ్డి, అసెంట్ ఓనర్ సెక్రెటరీ ఎన్ ఆర్ సి రాజు, ఏఐఆర్‌ఆర్టీ సెక్రెటరీ నర్సింగ్ రావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సాంబ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో నిరుపేదల సొంతింటి కల సాకారం : సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్న



**గంగాధర మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఈరోజు గంగాధర నిరుపేదల సొంతింటి కల సాకారం కావడమే నిజమైన అభివృద్ధి అని గంగాధర గ్రామ సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్న పేర్కొన్నారు. సోమవారం నాడు గంగాధర మండల కేంద్రంలోని గొల్లపెల్లి లత - సత్తయ్య దంపతులు తెలంగాణ ప్రభుత్వ ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించుకున్న నూతన గృహ ప్రవేశ మహోత్సవానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న సర్పంచ్, లబ్ధిదారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలు (కొత్త బట్టలు) అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. నిరుపేదలకు పక్కా గృహాలు కల్పించాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ఎందరో కుటుంబాల్లో వెలుగులు నింపుతోందన్నారు. ఒక సామాన్య కుటుంబం తమ కష్టార్జితంతో, ప్రభుత్వ సహకారంతో సొంతింటిని నిర్మించుకోవడం ఎంతో సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. తమ ఇంటి గృహప్రవేశానికి విచ్చేసి, కొత్త బట్టలు పెట్టి గౌరవించిన సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్నకు లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ యశ్వంత్,స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పొన్నం వెంకటేశం,మంత్రి మహేందర్,జంగిలి మహేష్,గంగాధర రమేష్ పాల్గొన్నారు.

# ఘనంగా విద్యా వారోత్సవాల మొదటి రోజు ఫౌండేషన్ డే వేడుకలు







**గంగాధర మే 11(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధరలో ఈరోజు విద్యా వారోత్సవాలు (11-05-2026 నుండి 17-05-2026 వరకు)ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాల మొదటి రోజు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంను పురస్కరించుకొని కార్యక్రమాలను ఘనంగా మరియు ప్రేరణాత్మకంగా నిర్వహించారు. గంగాధర హైస్కూల్‌లో భవిత యాక్టివిటీ రూమ్, టీజీఎంఎస్ గంగాధరలో సమ్మర్ క్యాంప్, గర్షకుర్తి పాఠశాలలో కిచెన్ షెడ్‌ను సర్పంచ్‌లు శ్రీమతి పడాల భాగ్యలక్ష్మి , శ్రీ రెండ్ల శ్రీనివాస్ , శ్రీ ఆంజనేయులు మరియు వార్డ్ సభ్యులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్వో శ్రీమతి అంబటి రజిత , ఎంపీడీఓ శ్రీ దమ్మాని రాము , ఎస్సై శ్రీ వంశీకృష్ణ , ఎంఈఓ శ్రీ ఏనుగు ప్రభాకర్ రావు పాల్గొని విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాలు అందించారు. సమ్మర్ క్యాంప్ సందర్భంగా ఎంపీడీఓ శ్రీ దమ్మాని రాము మాట్లాడుతూ, విద్యార్థులు ఈ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకొని కళలు, క్రాఫ్ట్, సంగీతం, క్రీడలు, రచనా నైపుణ్యాలు మరియు ఇతర సృజనాత్మక అంశాలను నేర్చుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. 25-05-2026 న జరిగే ముగింపు కార్యక్రమంలో తమ ప్రతిభను ప్రదర్శించాలని ఎంఆర్వో శ్రీమతి అంబటి రజిత విద్యార్థులను ప్రోత్సహించారు. ప్రిన్సిపాల్ శ్రీమతి పద్మ , తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వడ్డెర కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా గుంజ రేణుక నారాయణ నియామకంపై హర్షం

**- అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రమేష్ మంజాల**




**హైదరాబాద్, మే 10(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో అత్యంత బలహీనవర్గానికి చెందిన మహిళ గుంజ రేణుక నారాయణ ను వడ్డెర కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గా రాష్ట్ర ప్రభుత్వం నియమించడం పట్ల అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రమేష్ మంజాల హర్షం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్, బషీర్ నాగ్, దేశోద్ధారక భవన్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సంఘం మహిళా అధ్యక్షురాలు కుంచపు రామ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు రాపెన్ గిరిబాబు, ఉపాధ్యక్షులు ఏం. హనుమంతు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డి. కృష్ణ, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఈ. వెంకటేష్, ఎల్బీ నగర్ నియోజకవర్గం అధ్యక్షులు కె. బ్రహ్మయ్య తో కలసి రమేష్ మంజాల మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి వై. ఎస్. రాజశేఖర్ రెడ్డి రాష్ట్రంలో వడ్డెర కులస్థులు అత్యంత వెనుకబడి ఉన్నారని గుర్తించి, వడ్డెర ఫెడరేషన్ ఏర్పాటు చేసిన వడ్డెరుల సంక్షేమం కోసం రుణాలు మంజూరు చేయడం జరిగిందని, అనంతరం బి.ఆర్.ఎస్ పాలనలో వడ్డెర ఫెడరేషన్ కు నిధులు మంజూరు చేయకుండా మొండి చేయి చూపిందని గుర్తు చేసారు. సామజిక కార్యకర్తగా, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలుగా ప్రజలకు, పార్టీకు సేవలందించిన గుంజ రేణుక నారాయణ ను వడ్డెర కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమించడాన్ని బి.ఆర్.ఎస్ పార్టీకి చెందిన వడ్డెర కుల ద్రోహులు వ్యతరేకిస్తున్నారని, బి.ఆర్.ఎస్ హయాంలో వడ్డెర ఫెడరేషన్ కు ఎందుకు నిధులు కేటాయించలేదని, కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్ ను ఎందుకు నియమించలేదని అయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అత్యంత వెనుకబడి ఉన్న వడ్డెర సామాజికవర్గాన్ని గుర్తించి వారి సాధికారతకు వడ్డెర కో ఆపరేటివ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఒక మహిళను చైర్మన్ గా నియమించడం అభినందనీయం అని, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసే కాంగ్రెస్ పార్టీ ని విమర్శిస్తే సహించేదిలేదని, తగిన బుద్ధి చెపుతామని హెచ్చరించారు. వడ్డెరులు దశాబ్దాల నుండి కాంగ్రెస్ పార్టీ వెంటనే ఉన్నారని, ఇక ముందుకు కూడా కాంగ్రెస్ పార్టీ వెంటనే ఉంటామని రమేష్ మంజాల తెలిపారు.

# కరీంనగర్ ప్రముఖ పాత్రికేయులు అనిల్ కుమార్‌కు ఉత్తమ జాతీయ జర్నలిస్ట్ అవార్డు



**కరీంనగర్ జిల్లా మే11 (పీసీడబ్ల్యూ న్యూస్):** పత్రికారంగంలో విశిష్ట సేవలు అందించిన కరీంనగర్ తెలుగు వార్త బ్యూరో అనిల్ కుమార్‌కు "ఉత్తమ జాతీయ జర్నలిస్టు అవార్డు" లభించింది. దేశవ్యాప్తంగా సామాజిక సమస్యలు, ప్రజా అంశాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన చేసిన విశ్లేషణాత్మక కథనాలను గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.పలువురు ప్రజాప్రతినిధులు, జర్నలిస్టు సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు అనిల్ కుమార్‌ను అభినందించారు. నిజాయితీతో కూడిన వార్తా రచన, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ఆయన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ, ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ప్రజలకు నిష్పక్షపాత సమాచారాన్ని అందించడం జర్నలిస్టుల ప్రధాన ధ్యేయమని తెలిపారు. తనకు సహకరించిన సహచరులు, కుటుంబ సభ్యులు, పాఠకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ భక్తాంజనేయ స్వామి శోభాయాత్ర




**గంగాధర మే 11(పిసిడబ్ల్యూ న్యూస్ ):**కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోఈరోజు మధురానగర్ గ్రామంలోని శ్రీ భక్త ఆంజనేయ స్వామి దేవాలయం నుండి మండల అంజన్న స్వాములు శోభా యాత్ర నిర్వహించడం జరిగింది. ఇట్టి శోభ యాత్రను గ్రామ సర్పంచ్ వేముల భాస్కర్ గారు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించడం జరిగింది. శోభయాత్ర భజన కార్యక్రమం మరియు హనుమాన్ చాలీసా పారాయణం చేస్తూ అంగరంగ వైభవంగా శుభ యాత్ర నిర్వహించడం జరిగింది కార్యక్రమానికి భక్తులు అధిక స్థలానికి లో పాల్గొని విజయవంతం చేసినారు.

# దివ్యాంగ చిన్నారుల అభివృద్ధికి భవిత కేంద్రాలు ఎంతో దోహదం చేస్తాయి

**● గంగాధర సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్న**





**గంగాధర మే 11(పిసిడబ్ల్యూ న్యూస్ ):**కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రాన్ని (ప్రత్యేక అవసరాల గల పిల్లల వనరుల కేంద్రం) గ్రామ సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్న రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు సమాజంలో ఎవరికీ తీసిపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. భవిత కేంద్రం ద్వారా దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ వంటి సేవలతో పాటు, ప్రత్యేక విద్యా బోధకుల ద్వారా విద్యాబుద్ధులు నేర్పించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్లోని లోపాలను చూసి కుంగిపోకుండా, వారిని ఈ కేంద్రాల్లో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు.గ్రామ అభివృద్ధిలో భాగంగానే కాకుండా, సామాజిక బాధ్యతగా ఇలాంటి సేవా కేంద్రాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్న భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ దమ్మని రాము, ఎంఇఓ ప్రభాకర్ రావు,ఐ.ఈ.ఆర్.పి సిబ్బంది, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు,ఉపసర్పంచ్, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# జనగణన పై అవగాహన ర్యాలీ




**కల్లూరు, మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పట్టణంలో జనగణన 2027 కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మున్సిపల్ కమిషనర్ సిహెచ్ రాజశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ సిహెచ్ రాజశేఖర్ మాట్లాడుతూ దేశ అభివృద్ధికి జనగణన ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రతి కుటుంబం సరైన సమాచారం అందించడం ద్వారా ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు చేయడానికి దోహదపడుతుందని చెప్పారు. ప్రజలు జనగణన సిబ్బందికి సహకరించి నిజమైన వివరాలు అందించాలని కోరారు.ర్యాలీలో పాల్గొన్న వారు జనగణన 2027 విజయవంతం చేయండి ప్రతి వ్యక్తి వివరాలు నమోదు చేయండి వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు. పట్టణంలోని ప్రధాన వీధులలో ర్యాలీ కొనసాగి ప్రజల దృష్టిని ఆకర్షించింది.మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు, సెన్సెస్ డీలింగ్ అసిస్టెంట్ ఎం తనుజ , వార్డ్ ఆఫీసర్స్, ఏనుమరేటర్స్, సూపర్వైజర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతాంగానికి అండగా మాజీ ఎమ్మెల్యే సండ్ర

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద ప్రభుత్వ వైఫల్యాలపై ఆగ్రహం









**వేంసూరు, మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలో మర్లపాడు, కల్లూరుగూడెం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతూ రైతులను ప్రభుత్వం ఆగం చేస్తోందని ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో రాజకీయ జోక్యం పెరిగి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. గన్ని బ్యాగులు సరఫరా చేయడంలో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ రైతుల బాధలు పట్టించుకోవడం లేదన్నారు. మొక్కజొన్న కొనుగోళ్లు సక్రమంగా జరగక రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో హమాలీ కూలీలను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కరోనా సమయంలో కూడా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి గింజ కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచారని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలతో వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెడుతోందని విమర్శించారు. రైతు పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని సండ్ర వెంకట వీరయ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మీడియా స్వేచ్ఛను అణచివేయాలని చూస్తే సహించేది లేదు

**● జర్నలిస్టుల గొంతు నొక్కే ప్రయత్నాలు సహించం ● వార్త రాసినందుకు జర్నలిస్టుపై సోషల్ మీడియాలో దూషణలు. ● మీడియా స్వేచ్ఛను అణచివేయాలని చూస్తున్నారని విమర్శలు. ● కాంగ్రెస్ డాక్టర్ వీరన్న బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ ● ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ ఎందుకు స్పందించడం లేదో ప్రజలకు చెప్పాలని డిమాండ్ ● జర్నలిస్టు సహదేవ్‌కు పూర్తి మద్దతుగా ఉంటాం ● జర్నలిస్టు సహదేవ్‌కు వెంటనే క్షమాపణ చెప్పాలి: జర్నలిస్టు ప్రవీణ్ నాయక్**



**కురవి మే11(పి.సి.డబ్ల్యూ న్యూస్):** జర్నలిస్టులపై వ్యక్తిగత దూషణలు చేయడం, సోషల్ మీడియా వేదికగా అపప్రథలు సృష్టించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని జర్నలిస్టు ప్రవీణ్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టు బేతమల్ల సహదేవ్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మే 5న కురవి భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో బీజేపీ ఎంపీ రఘునందన్ రావుతో కలిసి కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ వీరన్న ప్రత్యేక పూజల్లో పాల్గొనడం రాజకీయంగా చర్చనీయాంశమైందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల్లో వ్యక్తమైన అనుమానాలు, రాజకీయ విశ్లేషణలను ఆధారంగా చేసుకొని పత్రికలో కథనం ప్రచురించబడిందన్నారు. అయితే ఆ వార్తను వక్రీకరించి జర్నలిస్టు సహదేవ్‌పై డబ్బులు డిమాండ్ చేశారంటూ ఆరోపణలు చేయడం అనైతికమని విమర్శించారు. వార్తలు రాసినందుకు జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకోవడం, వ్యక్తిగతంగా దూషించడం సరైన పద్ధతి కాదన్నారు. అధికార అహంకారంతో మీడియా గొంతు నొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజలకు నిజాలు తెలియజేయడం జర్నలిస్టుల బాధ్యత అని, వార్తలపై సమాధానం చెప్పాల్సింది పోయి వ్యక్తిగత ఆరోపణలకు దిగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ ఎందుకు స్పందించడం లేదో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఎందుకు వారిని వెనుకేసుకొస్తున్నారని, ఈ ఆరోపణలు చేయించిందీ ఎమ్మెల్యేనేనా అనే అనుమానాలకు సమాధానం చెప్పాలని కోరారు. జర్నలిస్టు వ్యవస్థపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలని హెచ్చరించిన నాయకులు, డాక్టర్ వీరన్న వెంటనే జర్నలిస్టు బేతమల్ల సహదేవ్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని, అలాగే జర్నలిస్టు సమాజానికి కూడా క్షమాపణలు తెలపాలని డిమాండ్ చేశారు. ప్రజా స్వామ్యంలో మీడియా నాలుగో స్థంభమని, దాని స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జర్నలిస్టు సహదేవ్‌కు ప్రతి జర్నలిస్టు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల పూర్తి మద్దతు ఉంటుందని వారు స్పష్టం చేశారు.

# బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

**మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య**



**సత్తుపల్లి, మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు.మైనర్ బాలికపై జరిగిన ఘటన అత్యంత దారుణమని, పోక్సో కేసు నమోదు అయినప్పటికీ ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం వెనుక రాష్ట్ర ప్రభుత్వ హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. కేంద్ర మంత్రి కుమారుడికి ఒక న్యాయం, సామాన్య ప్రజలకు మరో న్యాయమా అని ప్రశ్నించారు.మధ్యతరగతి కుటుంబానికి చెందిన మైనర్ బాలికను మోసం చేసి, మద్యం తాగించి పలుమార్లు అత్యాచారం చేశారనే ఆరోపణలు ఉన్నప్పటికీ, మొదట పోలీసులు కేసు నమోదు చేసేందుకు నిరాకరించారని ఆరోపించారు. బాధిత కుటుంబ సభ్యులు మోదీ సభలో ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించిన తర్వాతే పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు.బండి భగీరథ్‌ను కాపాడేందుకు ప్రయత్నించడం ద్వారా బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ఉన్న ఫెవికాల్ బంధం బయటపడుతోందని సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటే తక్షణమే బండి భగీరథ్‌ను అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జై బోలో హనుమాన్‌కి జై: హిందూ ఏక్తా యాత్ర కోసం కదలిరండి.. విజయవంతం చేయండి..


**- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర**

**కరీంనగర్,మే11(పీసీడబ్ల్యూ న్యూస్):** హనుమాన్ జయంతి (మే 12) సందర్భంగా కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హిందూ ఏక్తాయాత్ర కోసం హిందూ బంధువులందరూ కదిలి రావాలని, యాత్రను విజయవంతం చేయాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర కోరారు. సోమవారం రోజున కరీంనగర్లో ఆయన మాట్లాడుతూ కరీంనగర్లో ప్రతి ఏటా హనుమాన్ జయంతి సందర్భంగా కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో హిందూ ఏక్తా యాత్ర నిర్వహించడం ఒక ఆనవాయితీగా వస్తుందన్నారు. హిందువుల సంఘటత శక్తిని చాటేందుకు , లక్షలాదిమందితో జరిగే ఈ యాత్రకు తెలంగాణ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు వచ్చిందని తెలిపారు. కరీంనగర్లో జరిగే భారీ ఆధ్యాత్మిక కార్యక్రమంగా హిందూ ఎక్తాయాత్ర కు ఖ్యాతి గుర్తింపు లభించిందన్నారు. గత 12 ఏళ్లుగా ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం కరీంనగర్ నగరాన్ని కాషాయమంగా మార్చుతూ , ప్రతి ఏటా ఎంతో ఘనంగా , వైభవంగా కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ నిర్వహిస్తున్నారని తెలిపారు. వైశ్య భవన్ నుండి ప్రారంభమై కరీంనగర్లోని ప్రధాన కూడళ్ల మీదుగా కొనసాగే ఈ యాత్ర అశేష హిందూ బంధువుల, వివిధ హిందూ సంఘాల భాగస్వామ్యంతో విజయవంతంగా కొనసాగుతుందన్నారు.



# శుభవివాహ వేడుకలో రాజకీయ నేతల సందడి

**• ఈకేఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జగదీష్, హర్షిత రిసెప్షన్**



**కల్లూరు, మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పట్టణమునందు ఈకేఆర్ ఫంక్షన్ హాల్‌లో కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ కుమారుడు జగదీష్ వివాహ రిసెప్షన్ వేడుక ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి శీలం బ్రహ్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, నూతన దంపతులు జగదీష్, హర్షితలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాహ బంధం పరస్పర గౌరవం, ప్రేమ, విశ్వాసంతో బలపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు, స్నేహితులు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. వేదికను అలంకరించిన పుష్పాలంకరణలు, దీపాల కాంతులు వేడుకకు ప్రత్యేక శోభను చేకూర్చాయి. అతిథుల కోసం ఏర్పాటు చేసిన విందు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మొత్తం కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య సజావుగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు పలువురు పాల్గొన్నారు.


# ఘనంగా ప్రారంభమైన సమ్మర్ క్యాంప్

**విద్యా వారోత్సవాల్లో భాగంగా కల్లూరు పాఠశాలలో ఉత్సాహభరిత కార్యక్రమాలు**

**ఎంఈఓ పత్తిపాటి నివేదిత**







**కల్లూరు, మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో తొలి రోజున ప్రభుత్వ ఉన్నత పాఠశాల కల్లూరులో సమ్మర్ క్యాంప్ మండల విద్యాశాఖ అధికారి పత్తిపాటి నివేదిత ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైంది. కల్లూరు మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, మొదటి రోజున ఆటలు, కంప్యూటర్ బేసిక్స్‌పై శిక్షణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రపరచి, మామిడి తోరణాలతో అందంగా అలంకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులు ఆటలాడుతూ నేర్చుకోవడం ద్వారా సెలవులను సద్వినియోగం చేసుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సృజనాత్మకతను పెంపొందించే విధంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలలు విద్యా వారోత్సవాలను ఒకేసారి ప్రారంభించుకోవడం విశేషం. ఈ సమ్మర్ క్యాంప్‌లో సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొని, కొత్త విషయాలను నేర్చుకుంటూ ఆనందంగా గడిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆసక్తిని పెంచి, వారి సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని ఉపాధ్యాయులు తెలిపారు.

# ప్రజాపాలన ప్రగతి పథంలో ఘనంగా విద్యా వారోత్సవాలు

**• ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో**

**మాజీ విద్యార్థులకు ఘన సన్మానం**





**ఏటూరునాగారం,మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "ప్రజాపాలన ప్రగతి పథంలో" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాలు (జుఎబఝ్అశీఅ ఔవవఎ) ఘనంగా నిర్వహించబడ్డాయి. విద్య, ప్రజాసేవ, సమాజ అభివృద్ధి అనే లక్ష్యాలతో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులు, అధ్యాపకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా అదే కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసి, ప్రస్తుతం ప్రజాసేవలో విశేషంగా ముందుకు సాగుతున్న ప్రజాప్రతినిధులను కళాశాల ప్రిన్సిపాల్ మరియు అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో: 9 15వ వార్డు సభ్యులు శ్రీ నాగవత్ కిరణ్7వ వార్డు సభ్యులు శ్రీ మాదరి మధువారిని శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, "మా కళాశాలలో చదివిన విద్యార్థులు నేడు ప్రజా సేవలో ఆదర్శంగా నిలవడం ఎంతో గర్వకారణం. విద్యతో సాధించిన విజయాలను సమాజ సేవకు వినియోగిస్తూ ప్రజల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయం" అని పేర్కొన్నారు. అధ్యాపకులు మాట్లాడుతూ, ప్రజాసేవలో నిబద్ధతతో పనిచేస్తున్న ఈ ఇద్దరు ప్రజాప్రతినిధులు ప్రస్తుత విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు. విద్యతో పాటు సమాజంపై బాధ్యత కలిగి ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ఈ సన్మాన కార్యక్రమం విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించడమే కాకుండా, విద్యతో ఉన్నత స్థానాలకు చేరుకొని సమాజానికి సేవ చేయాలనే ప్రేరణను కలిగించింది. ప్రజాసేవలో ముందుండి యువతకు ఆదర్శంగా నిలుస్తున్న శ్రీ నాగవత్ కిరణ్, శ్రీ మాదరి మధు గారికి పలువురు అభినందనలు తెలిపారు.

# హిందూ ఏక్తా యాత్రకు సర్వం సిద్ధం

**- రాష్ట్రం నలమూలల నుండి తరలి రానున్న కాషాయ సైనికులు.**

**- పిల్లాపాపలతో ఏక్తా యాత్ర ర్యాలీకి వచ్చేందుకు సిద్ధమైన కరీంనగర్ పార్లమెంట్ ప్రజలు**



**కరీంనగర్ జిల్లా మే11 (పీసీడబ్ల్యూ న్యూస్):** హిందూ ఏక్తా యాత్రకు సర్వం సిద్ధమైంది. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 12న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'హిందూ ఏక్తా యాత్ర'కు రాష్ట్రం నలుమూలల నుండి తరలివచ్చేందుకు కాషాయ శ్రేణులు సిద్ధమయ్యాయి. మరోవైపు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఊరూవాడా నుండి తరలివచ్చి హిందూ ఏక్తా యాత్రను వీక్షించేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరోవైపు హిందువులందరినీ సంఘటితం చేయడమే లక్ష్యంగా ప్రతి ఏటా బాల గంగాధర్ తిలక్ గణేశ్ ఉత్సవాలను ప్రారంభించిన సంగతి తెలిసిదే. అదే స్ఫూర్తితో హిందువులందరినీ రాజకీయాలకు అతీతంగా సంఘటితం చేయాలనే లక్ష్యంతో సరిగ్గా 16 ఏళ్ల క్రితం బండి సంజయ్ కుమార్ గుప్పెడు మందితో కరీంనగర్ లో "హిందూ ఏక్తా యాత్ర"ను ప్రారంభించారు. ఇంతింతై వటుడింతై అన్నట్లుగా గుప్పెడు మంది నుండి వందలుగా, వేలుగా హిందువులంతా తరలివచ్చి హిందూ ఏక్తా యాత్రలో పాల్గొంటున్నారు. ప్రతి ఏటా హిందూ ఏక్తా యాత్రకు వచ్చే హిందువుల సంఖ్య పెరుగుతూనే ఉంది. గత ఏడాది సైతం భారీ సంఖ్యలో జనం తరలివచ్చారు. ఈసారి అంతకు మించి ప్రజలు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేస్తున్నారు. **గతంకంటే మిన్నగా...** గతానికి భిన్నంగా ఈసారి 'హిందూ ఏక్తా యాత్ర'కు రావాలంటూ కాషాయ శ్రేణులు, కార్పొరేటర్లు ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్నారు. కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. కాషాయ శ్రేణులు తమ తమ డివిజన్లలోని, కాలనీల్లోని గోడలపై 'హిందూ ఏక్తా యాత్ర'కు తరలి రావాలంటూ స్వయంగా వాల్ పెయింటింగ్ రాశారు. సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. **వేసవిలో ఇబ్బంది లేకుండా....** బండి సంజయ్ ఆధ్వర్యంలో ఈనెల 12న సాయంత్రం 4 గంటలకు కరీంనగర్ లోని వైశ్యా భవన్ నుండి ప్రారంభమయ్యే ఏక్తా యాత్ర కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు జనం ఉత్సాహం చూపుతుండటంతో వారికి ప్రత్యేకంగా రవాణా సదుపాయం కల్పించేందుకు కాషాయ శ్రేణులు సిద్ధమయ్యాయి. మరోవైపు ఎండాకాలం కావడంతో ఏక్తా యాత్రలో పాల్గొనే వారికి కాషాయ శ్రేణులు, హిందుత్వ వాదులు, వ్యాపారులు స్వచ్ఛందంగా మంచినీళ్లు, మజ్జిగ, ఇతర ఆహార పానియాలను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేశారు. **హిందూ ఏక్తా యాత్ర ఆరంభమయ్యేది ఇలా...** కరీంనగర్ లోని వైశ్య భవన్ నుండి 12న సాయంత్రం 4 గంటలకు హిందూ ఏక్తా యాత్ర ర్యాలీ ప్రారంభం కానుంది. ర్యాలీ ఆరంభంలోనే వైశ్యాభవన్ వద్ద హిందుత్వ వాదులను ఉద్దేశించి బండి సంజయ్ ప్రసంగిస్తారు. అనంతరం వైశ్యా భవన్ నుండి ప్రారంభమయ్యే ర్యాలీ రాజీవ్ చౌక్, టవర్ సర్కిల్, గంజ్, కమాన్ , వన్ టౌన్, వెంకటేశ్వర టెంపుల్, అమరవీరుల స్థూపం, జయశంకర్ సర్కిల్, రాజీవ్ చౌక్ మీదుగా తిరిగి వైశ్య భవన్ కు చేరుకుంటుంది. ఇక్కడే హిందూ ఏక్తా యాత్రను ముగిస్తారు. ఈ యాత్రకు కులాలను పక్కన పెట్టి హిందువులంతా రావాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇచ్చిన పిలుపు మేరకు రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీల కార్యకర్తలంతా ఈ యాత్రకు హాజరవుతుండటం విశేషం. ముఖ్యంగా వివిధ కుల సంఘాల నాయకులంతా సంఘీభావం తెలిపారు. వీరితోపాటు వివిధ వృత్తి సంఘాలు, ధార్మిక సంస్థలు, కళాకారులు, కార్మిక సంఘాల నాయకులు ఈ యాత్రలో పాల్గొనబోతోన్నాయి. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ **ఆకట్టుకోనున్న కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలు** దాదాపు 6 గంటలపాటు కొనసాగే హిందూ ఏక్తా యాత్రలో పాల్గొనే హిందుత్వ వాదులు, కరీంనగర్ పట్టణ ప్రజలను ఆకట్టుకునేలా వివిధ రూపాల్లో కళా ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఇప్పటికే కేరళ నుండి హనుమంతుడు, హైదరాబాద్ నుండి శ్రీరాముడి విగ్రహాలను కరీంనగర్ కు తరలిస్తున్నారు. ఢిల్లీ నుండి ప్రత్యేక వేషధారణలతో ఆకట్టుకునే కళాకారులను రప్పిస్తున్నారు. కేరళ నుండి డప్పు వాయిద్య కళాకారులు వస్తున్నారు. ప్రత్యేకంగా సిరిసిల్ల నుండి ప్రతి ఏటా ధ్వజాలు రాబోతున్నాయి.

# కరీంనగర్‌లో దివ్యాంగ చిన్నారులకు సహాయక ఉపకరణాల పంపిణీ..





**కరీంనగర్ టౌన్ మే 11(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని ముకరంపురా భవిత సెంటర్‌లో కరీంనగర్ విద్యా శాఖ ఆధ్వర్యంలో అలిమ్కో సహకారంతో నిర్వహించిన సహాయక ఉపకరణాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో 120 మంది దివ్యాంగ చిన్నారులకు అవసరమైన సహాయక ఉపకరణాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోమటిరెడ్డి నరేంద్ర రెడ్డి చిన్నారులకు ఉపకరణాలను అందజేశారు. దివ్యాంగుల జీవితాల్లో ఈ ఉపకరణాలు ఎంతో మార్పు తీసుకువస్తాయని, వారి దైనందిన జీవనంలో సౌలభ్యం కలిగిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొలగని శ్రీనివాస్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అశ్విని తనజీ వాకోడే, జిల్లా సంక్షేమాధికారి సరస్వతి తదితరులు పాల్గొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దివ్యాంగ చిన్నారులతో ముచ్చటించి వారి అవసరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా దివ్యాంగుల పట్ల ప్రభుత్వ నిబద్ధత మరోసారి స్పష్టమైంది.



# అధికార అహంకారానికి చట్టం బానిస కాకూడదు: ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

**చిన్నారి ఆవేదనకు న్యాయం ఎక్కడ..?**

**తప్పు చేసినవారెవ్వరైనా శిక్షించాలనే సందేశం సమాజానికి వెళ్లాలి**



**ఖమ్మం ప్రతినిధి, మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బలహీన వర్గానికి చెందిన మైనర్ బాలికపై జరిగిన అత్యాచార ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, ఈ కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు, బండి భగీరథను వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒక అమాయక చిన్నారి జీవితాన్ని చీకటిలోకి నెట్టేసేలా జరిగిన ఈ దారుణ ఘటనను రాజకీయ పలుకుబడితో కప్పిపుచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలికి అండగా నిలవాల్సిన అధికార యంత్రాంగం, నిందితులను రక్షించేలా వ్యవహరిస్తే ప్రజల్లో న్యాయ వ్యవస్థపై నమ్మకం పోతుందని పేర్కొన్నారు. మైనర్ బాలికపై అత్యాచారం వంటి అత్యంత తీవ్రమైన నేరంలో పోక్సో చట్టం కింద కఠిన సెక్షన్లు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాల్సి ఉండగా, కేసును బలహీనపరిచేలా పోలీసులు వ్యవహరిస్తున్న తీరు బాధాకరమని ఆరోపించారు. చట్టం ముందు అందరూ సమానమే అనే రాజ్యాంగ సూత్రాన్ని నిలబెట్టాల్సిన సమయంలో అధికార ప్రభావం పనిచేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమన్నారు. ఒక చిన్నారి కన్నీటి వెనుక ఉన్న బాధను రాజకీయ రంగులతో చూడటం మానవత్వానికి మచ్చ అని పేర్కొన్నారు. బాధిత కుటుంబంపై ఒత్తిళ్లు, బెదిరింపులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు మరింత కలవరపెడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. సమాజంలో బలహీన వర్గాలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, కానీ ఇలాంటి ఘటనల్లో బాధితులే న్యాయం కోసం పోరాడాల్సి వస్తోందని ఆవేదన చెందారు. "తప్పు చేసిన వ్యక్తి ఎంతటి రాజకీయ కుటుంబానికి చెందిన వారైనా, ఎంతటి పదవిలో ఉన్న వారైనా చట్టం ముందు నిలబడాల్సిందే. అదే నిజమైన ప్రజాస్వామ్యం, అదే రాజ్యాంగ విలువ" అని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ స్పష్టం చేశారు. చిన్నారుల రక్షణ కోసం రూపొందించిన పోక్సో చట్టం కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా కఠినంగా అమలవ్వాలని ఆయన కోరారు. భారతీయ సంస్కృతి, మహిళా గౌరవం గురించి మాట్లాడే రాజకీయ పార్టీలు ఇలాంటి ఘటనలపై స్పష్టమైన వైఖరి తీసుకోవాలని, నిందితులను కాపాడే ప్రయత్నాల కంటే బాధితురాలికి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ఘటనలో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథను వెంటనే అరెస్టు చేసి, బాధిత బాలికకు పూర్తి రక్షణ కల్పించాలని, కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారించి కఠిన శిక్ష విధించాలని బిఆర్ఎస్ పార్టీ తరపున ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ డిమాండ్ చేశారు. 'చిన్నారి కన్నీటి విలువను సమాజం గుర్తించాలి. అధికారానికి కాదు, న్యాయానికి గెలుపు దక్కాలి' అని ఆయన పిలుపునిచ్చారు.

# జీవో నెంబర్ 17 రద్దు చేయాలి .. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్లకు న్యాయం చేయాలి

## ములుగు జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు



**ములుగు జిల్లా,మే 11(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్లకు అన్యాయం చేసే జీవో నెంబర్ 17ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం అందజేశారు. ఈరోజు ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పాలనాధికారికి వినతిపత్రం సమర్పించిన సందర్భంగా భూక్య జంపన్న మాట్లాడుతూ, 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాలు మరియు వసతి గృహాలలో అమలు చేస్తున్న కాంట్రాక్టు విధానం పేద వర్గాల కాంట్రాక్టర్లకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు. గతంలో అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేవెళ్ల సభలో మాట్లాడుతూ ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 12 శాతం, బీసీలకు 42 శాతం కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమలైన పాత టెండర్ విధానాన్నే కొనసాగించాలని, ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ పేరుతో తీసుకొచ్చిన జీవో నెంబర్ 17 వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ కాంట్రాక్టర్లను వ్యవస్థ నుంచి దూరం చేసే కుట్ర జరుగుతోందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోని గురుకులాలు, వసతి గృహాలలో పనిచేస్తున్న స్థానిక కాంట్రాక్టర్లు విద్యార్థులను తమ పిల్లలుగా భావించి సేవలు అందిస్తున్నారని, బిల్లులు ఆలస్యమైనా నష్టాలను భరిస్తూ విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు పెద్ద కాంట్రాక్టర్లకు లాభం చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. డీపీసీతో సంబంధం లేకుండా సిండికేట్ కాంట్రాక్టు వ్యవస్థను తీసుకురావాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వెంటనే జీవో నెంబర్ 17ను రద్దు చేసి పాత టెండర్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవేళ జీవోను రద్దు చేయకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను ఏకం చేసి రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు, ధర్నాలు చేపడతామని భూక్య జంపన్న హెచ్చరించారు. "పేద వర్గాల కాంట్రాక్టర్లకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోము.. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తాం" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బరిగెలపల్లి సర్పంచ్ వీరబోయిన రాజేందర్, శ్రీనగర్ మాజీ సర్పంచ్ గుగులోత్ రామాల నాయక్, జాకారం ఉపసర్పంచ్ బొట్ల కార్తీక్, బీఆర్ఎస్ నాయకులు పాత్య కుమార్, స్వేరో నెట్‌వర్క్ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల గణేష్, జిల్లా ఈసీ సభ్యులు పైడి, ఈర్ల కవిరాజ్, నేరెళ్ల శ్రీకాంత్, శ్రీరాముల శ్రీనివాస్, రాజబోయిన సాంబయ్య, దొంత రాకేష్, నరేందర్, శంకర్ నాయక్, వంశీ, బిక్షపతి, రామచందర్, ప్రశాంత్, మునుపాక రఘుపతి, ఆరేపల్లి శ్రావణ్ కుమార్, గడ్డం శ్యాం బాబు, బలుగూరి జయంత్, కలువాల మోక్షజ్ఞ, వినోద్ కుమార్, బాలాజీ, పశువుల కార్తీక్, రాజు యాదవ్, రాజు గంగపుత్ర, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం

## • ప్రజలు వినియోగించుకోండి:

## కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సూచన




**కల్లూరు, మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజా సమస్యలకు సమీప ప్రాంతంలోనే త్వరితగతిన పరిష్కారం కల్పించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ (ఐఏఎస్) సూచించారు. ఈ కార్యక్రమం కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరుగుతుందని, డివిజన్ స్థాయి అధికారులందరూ హాజరై ప్రజల వినతులను స్వీకరిస్తారని తెలిపారు. ఖమ్మం జిల్లా విస్తీర్ణం ఎక్కువగా ఉండటంతో జిల్లా కేంద్రానికి వెళ్లి ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేకుండా స్థానికంగా ఈ వేదికను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఉదయం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించబడగా, మధ్యాహ్నం అధికారులతో సమీక్ష సమావేశం జరుగుతుందని వివరించారు. గత వారం అందిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యల పురోగతిని కూడా ఈ సమావేశంలో పరిశీలిస్తామని తెలిపారు. ఈ పరిష్కార వేదికలో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ సోమవారం జరిగే గ్రీవెన్స్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కోరారు.


# పోగొట్టుకున్న మొబైల్ బాధితుడికి అందజేసిన చిట్యాల ఎస్ఐ సతీష్



**చిట్యాల మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్ ):** చిట్యాల మండలం, జాడలపేట గ్రామానికి చెందిన బండి రాజు సుమారు ఆరు నెలల క్రితం తన 'ఒప్పో' మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నారు. దీనిపై ఆయన చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు CEIR పోర్టల్‌లో నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, CEIR పోర్టల్ ద్వారా ఈ మొబైల్ ఫోన్‌ను కానిస్టేబుల్ లాల్ సింగ్ ట్రాక్ చేసి గుర్తించారు. రికవరీ చేసిన ఫోన్‌ను చిట్యాల ఎస్.ఐ సతీష్ బాధితుడు బండి రాజుకు పోలీస్ స్టేషన్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.ఐ సతీష్ మాట్లాడుతూ, ప్రజలు తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నప్పుడు వెంటనే www.ceir.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. పోగొట్టుకున్న ఫోన్ దొరికినందుకు బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

# శేరిలింగంపల్లి అక్రమ నిర్మాణాలపై సూరన్న సమరశంఖం

## - అక్రమ నిర్మాణాలపై ప్రజావాణిలో ఫిర్యాదు - అధికారులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ






CORE URBAN REGION ECONOMY (CURE)

Grievance Acknowledgement

Date : 11-05-2026

Department : Unauthorized Construction

Grievance Mode : Praja Vani

Ward Details: 234-Kondapur

Dear Mr/Mrs Dupta Suresh (Suranna),

Your Grievance regarding Unauthorized Construction has been registered with Grievance ID 1105265863814 and will be shortly attended by M.N. VENKATA RAMANA-ACP(9949488996) .

Gist of Complaint: Unathorized construction at Rajarajeshwari Colony Plot No.14

Thank You

INCHARGE

Please visit MYCURE Mobile App or call 040-21111111, Dial 100 for status Updates

**హైదరాబాద్ మే 12(పిసిడబ్ల్యూ న్యూస్):** జిహెచ్ఎంసి అధికారుల అవినీతి అక్రమాలకు హద్దు అదుపు లేకుండా పోయింది. శేరిలింగంపల్లి జోన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న మూడు ప్రధాన భవనాలపై ఇప్పటికే ప్రజావాణి లో సూరన్న ఫిర్యాదు చేశారు. ఈ అక్రమ కట్టడాల వల్ల ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కడమే కాకుండా స్థానిక ప్రజలకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ మూడు భవనాల వ్యవహారంలో పక్కా ఆధారాలతో టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోకపోవడం వెనుక అధికారుల హస్తం ఉందనే అనుమానాలు బలపడుతున్నాయి. మున్సిపల్ కమిషనర్ స్పందించి టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి పై వస్తున్న అనేక ఫిర్యాదును ప్రత్యేకంగా పరిశీలించి, సదరు భవనాల నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాలకు కొమ్ముకాస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు వల్ల వ్యవస్థ భ్రష్టు పడుతోందని ప్రజావాణిలో అందిన అక్రమ భవనాల ఫిర్యాదులను బుట్టదాఖలు చేసిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాల్సిన సూరన్న కమిషనర్ ను కోరారు. ఈ అక్రమాలపై సూరన్న రాజీలేని పోరాటానికి సిద్ధమయ్యారు. ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులపై అధికారులు స్పందించకుంటే, బాధితుల పక్షాన నిలబడి అధికారుల అంతు చూసే వరకు సూరన్న విశ్రమించిననీ హెచ్చరించారు. ఒక్కొక్క టౌన్ ప్లానింగ్ అధికారి కూడబెట్టిన కోట్లకొద్ది అక్రమ ఆస్తుల చిట్టాను బయటకు తీస్తామని, అక్రమ నిర్మాణాల పునాదులు కదిలిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ అధికారుల అవినీతితో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతుంటే చూస్తూ ఊరుకోలేము. ముఖ్యంగా ఈ మూడు భవనాల విషయంలో కమిషనర్ తక్షణమే జోక్యం చేసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలి. అవినీతి అధికారుల అండతో సాగుతున్న ఈ అక్రమ సామ్రాజ్యాన్ని కూల్చివేయాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి ప్రభుత్వం అవినీతిపై ఉక్కుపాదం మోపుతుంటే, శేరిలింగంపల్లి అధికారులు మాత్రం పాత పద్ధతుల్లోనే భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. సూరన్న నేతృత్వంలో సాగే ఈ పోరాటం ద్వారా, అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్న అధికారుల అసలు స్వరూపాన్ని బయట పెడతామన్నారు. ఇకనైనా అధికారులు తమ తీరు మార్చుకోకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తున్నాము.

# ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశంలో పాల్గొన్న సుడా చైర్మన్






**కరీంనగర్ రూరల్ ,మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ రూరల్ మండలంలోని బహదూర్‌ఖాన్‌పేట్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు గుర్రం ఎల్లవ్వమల్లయ్య దంపతుల కొత్త ఇంటికి గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుడా చైర్మన్ కొమటిరెడ్డి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం పేదల గృహ కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా ఇళ్లను నిర్మించి అందజేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు

# అందుకే మోదీ బంగారాన్ని కొనొద్దన్నారు: రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ మే 11(పిసిడబ్ల్యూ న్యూస్):** బంగారం కొనొద్దని, విమానాల్లో ప్రయాణించొద్దని చెప్పడం ప్రధాని మోదీ వైఫల్యాన్ని సూచిస్తున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్స్‌లో సభ నిర్వహించిన మోదీ దేశ ప్రజలకు పలు సూచనలు చేసిన విషయం తెలిసిందే. సోమవారం రేవంత్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో దీనిపై స్పందించారు. "విదేశాంగ విధానంలో మోదీ ప్రభుత్వం విఫలమైంది. ప్రభుత్వ అసమర్థ విధానాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రజలకు పిలుపు ఇచ్చారు. ఇది బాధ్యతారాహిత్యమైనది. రాహుల్ గాంధీ మొదటి నుంచి అదే చెబుతున్నారు. ప్రతిపక్షాల సూచనలను తీసుకోవాలి.. అఖిలపక్షాలను పిలిచి మాట్లాడాలి. కేంద్రానికి స్పష్టమైన విధానం లేదు. అనుభవరాహిత్యం, అహంకారం వల్లనే దేశాన్నిసంక్షోభంలోకి నెడుతున్నారు. యూరియాను కేంద్రం ఇవ్వాలి.. రాష్ట్ర ప్రభుత్వం పంచాలి" అని విమర్శించారు. **2029లో జమిలి ఎన్నికలు** కేరళలో 3 సీట్లు ,తమిళనాడులో 2 సీట్లు మాత్రమే బీజేపీ గెలుచుకుందని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. "ఎస్ఐఆర్‌ను బీజేపీ ఆయుధంగా ఉపయోగిస్తోంది. పశ్చిమ బెంగాల్‌లో 90 లక్షల ఓట్లను తొలగించారు. ఏ రాష్ట్రంలో గెలవాలంటే అక్కడ ఎస్ఐఆర్ ను ప్రయోగిస్తున్నారు. జూబ్లీహిల్స్ లో బీజేపీకి డిపాజిట్ రాలేదు.. మున్సిపాలిటీల్లో బీజేపీ పరిస్థితి ఏమిటి? జమిలి ఎన్నికలు 2029లో పెట్టడానికి ఆస్కారం ఉంది. బీజేపీకి ప్రజాస్వామ్యంపైన నమ్మకం లేదు. అతి పెద్ద పార్టీని ప్రభుత్వ ఏర్పాటు కోసం గవర్నర్ ఆహ్వానించాలి. గవర్నర్ చెప్పిన తేదీన బలనిరూపణ చేయించుకుంటే సరిపోతుంది. బండి సంజయ్ కొడుకు అంశంపైన డీజీపీ, ఇతర అధికారులతో సమీక్ష చేశాను. విచారణ ప్రారంభమైంది.. పోలీసులు చర్యలు తీసుకుంటారు. బీఆర్ఎస్ వాళ్లు కోరుకున్నట్లు క్షణాల మీద జరగదు. బాదితులను కలిసి స్టేట్ మెంట్ తీసుకుని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. మైనర్ బాలిక కు సంబంధించిన అంశంలో అంతా భాద్యతాయుతంగా ఉండాలి. తుమ్మడి హట్టి పైన ఇప్పటికే మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాశాం. మహారాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించేలా చూడాలని ప్రధాని మోదీకి నేను లేఖ రాశాను. తెలంగాణకు కేంద్రం నుంచి ఆశించిన మేరకు సహకారం లేదు. రీజనల్ రింగ్ రోడ్డు నార్త్ పార్ట్ , కాకాతీయ మెగా టెక్స్ టైల్స్, ఎయిర్ పోర్టులు క్లియర్, డిఫెన్స్ ల్యాండ్స్, మూసీ కోసం ఏడీబీ నిధులు, నేషనల్ హై వేలు వచ్చాయి. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఇవి ముందుకు సాగలేదు. మేం వచ్చాక క్లియర్ చేయిస్తున్నాం. మెట్రో, సదరన్ పార్టు రీజనల్ రింగ్ రోడ్డు ఇలా కొన్ని పెండింగ్ లో ఉన్నాయి. సింగిల్ విండో విధానం తీసుకువచ్చి పరిష్కరించమని ప్రధానిని కోరాం. అధికారిక కార్యక్రమంలో రాజకీయాలు లేవు. రాజకీయ అంశాలకు తావు లేదు. నేను, మోదీ ప్రస్తావించింది అభివృద్ధిని మాత్రమే. అభివృద్ధి విషయంలో కలిసి పనిచేద్దామని ఆయన చెప్పారు" అని తెలిపారు. తమ ఇద్దరి మధ్య జరిగిన ప్రస్తావన అభివృద్ధికి చెందినది మాత్రమేనని.. అందులో రాజకీయాలకు తావులేదని చెప్పారు.

# పురిటి నొప్పులు పాట పోస్టర్ ఆవిష్కరణ



**చిట్యాల మే 11 (పీసీడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలోనీ తిర్మలాపూర్ గ్రామానికి చెందిన వర్ధమాన గేయ రచయిత దాసారపు నరేష్ రచించిన పురిటి నొప్పులు పాట చిట్యాల మండల ఎంపిడిఓ టి.జయశ్రీ గారి చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది ఎంపిడిఓ జయశ్రీ మాట్లాడుతూ అమ్మని మించిన దైవం లేదని సృష్టికి జీవం పోసి నవమాసాలు మోసి జగతినీ చూపించి కమ్మని ప్రేమను పంచి మనకు బతుకు బాటను చూపే తల్లి మనం ఎన్ని జన్మలు ఎత్తిన అమ్మ ఋణం తీర్చుకోలేమని అందుకే అమ్మను ప్రేమించాలని,కన్నందుకు అమ్మ ప్రేమను మరువద్దని అన్నారు తదనంతరం అమ్మపాటను రాసినందుకు అదే విధంగా పాట పాడిన అనితను ఇంకా ఎన్నో పాటలు పాడాలని మంచి పేరు పొందాలని ఎంపిడిఓ అభినందించడం జరిగింది అన్నారుఈ కార్యక్రమంలో చిట్యాల మండల ఎంపిఓ .ఏ రామకృష్ణ ,పుల్ల ప్రభాకర్ టైపిస్ట్, తిరుమలాపూర్ కార్యదర్శి రాజేష్ ,మిట్టపెల్లి మిత్రమండల అధ్యక్షులు పుల్ల సతీష్ కుమార్ ,గాయకులు పుల్ల ప్రతాప్, జీడి సంపత్,మొగిలి,తదితరులు పాల్గొన్నారు

# గోషామహల్‌లో అక్రమ నిర్మాణాల అడ్డా


**టౌన్ ప్లానింగ్ అధికారుల మౌనానికి కారణం మామూళ్లేనా.?**

**200 గజాల స్థలంలో 8 అంతస్తులు అక్రమ సెల్లార్**

**జిహెచ్ఎంసి అధికారుల కనుసైగల్లోనే భారీ నిర్మాణాలు ఒక్కో నిర్మాణం వద్ద 10 లక్షలకు తగ్గేదే లేదట.?**

**మీడియాని అడ్డం పెట్టుకొని చక్రం తిప్పుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు**








**గోషామహల్ మే 11(పిసిడబ్ల్యూ న్యూస్):** గోషామహల్ సర్కిల్–30 పరిధిలో అక్రమ నిర్మాణాలు రోజురోజుకు పెచ్చుమీరుతున్నాయి. మున్సిపల్ నిబంధనలు, భద్రతా ప్రమాణాలు, ప్రజల ప్రాణాలు అన్నీ పక్కనబెట్టి బిల్డర్లతో చేతులు కలిపిన కొంతమంది టౌన్ ప్లానింగ్ అధికారులు కోట్ల రూపాయలు దండుకుంటున్నారన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సెక్షన్ ఆఫీసర్ మహేందర్ పేరు ఇప్పుడు గోషామహల్ సర్కిల్ ప్రాంతంలో పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది. "డబ్బు ఇస్తే ఏ అక్రమ నిర్మాణానికైనా సార్ గ్రీన్ సిగ్నల్" అనే స్థాయిలో వ్యవహారం నడుస్తోందని స్థానికులు మండిపడుతున్నారు. **200 గజాల్లో 8 అంతస్తులు, అధికారులకు కనిపించలేదా.?** మంగళ్ హాట్‌లోని ప్రకాష్ టాకీస్ ఎదురుగా ఇంటి నెంబర్ 13-1-12/10 వద్ద సుమారు 200 గజాల స్థలంలో ఏకంగా 8 అంతస్తుల భారీ నిర్మాణం కొనసాగుతుండటం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. సుమారుగా 10 ఫీట్ల సన్నని గల్లీలో ఇంత భారీ నిర్మాణం ఎలా అనుమతించారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్థానికుల మాటల్లో చెప్పాలంటే "పర్మిషన్ కేవలం స్టిల్ ప్లేస్ టు కు మాత్రమే తీసుకొని ఏకంగా 8 అంతస్తులు నిర్మించారంటే డిప్యూటీ కమిషనర్ ఉమా ప్రకాష్, ఏసీపీ బాలస్వామి, సెక్షన్ ఆఫీసర్ మహేందర్ అవినీతి ఎంత తీవ్రస్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. అక్రమ అంతస్తులు, నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్లు, భవిష్యత్తులో గోదాములుగా ప్రమాదకర నిర్మాణాలు" అన్నీ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయట. ఇంత భారీ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు కనీసం ఒక నోటీసు కూడా ఇవ్వకపోవడం పై అనేక అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా పేదవాడు చిన్న ఇల్లు వేసుకున్నా నిబంధనల పేరుతో వెంటనే కూల్చివేత లు చేసే మున్సిపల్ సిబ్బంది అధికారులు, ఇక్కడ మాత్రం ఎందుకు మౌనం పాటిస్తున్నారు.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. **ఒక్కో నిర్మాణానికి రూ.10 లక్షల వసూళ్లా.?** స్థానికుల ఆరోపణల ప్రకారం ఇదే గల్లీలో అనేక సెల్లార్లతో అక్రమ నిర్మాణాలకు జరుగుతుంటే స్థానికుల ఫిర్యాదులను పక్కనబెట్టడం, చర్యలు తీసుకోకుండా ఫిర్యాదు ఫైళ్లు క్లోజ్ చేయడం కోసం సెక్షన్ ఆఫీసర్ మహేందర్ పూర్తిస్థాయిలో అక్రమ నిర్మాణదారులకు సహకరిస్తున్నారు అని ఆరోపణలు ఉన్నాయి. అధికారులు ఒక్కో నిర్మాణం నుంచి రూ.10 లక్షలకుపైగా వసూల్ చేశారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. గోషామహల్ ప్రాంతంలో అక్రమ నిర్మాణాల సంఖ్య తీవ్రంగా పెరగడానికి ప్రధాన కారణం అధికారులకు భారీగా ఇస్తున్న మామూళ్ల పనేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. **డబ్బు ఇస్తే చాలు, ఎన్ని అంతస్తులైనా కట్టొచ్చు** సెక్షన్ ఆఫీసర్ మహేందర్ ఏసీబీ బాలస్వామి కి మామూళ్లు ఇస్తే ఎన్ని అంతస్తులైన కట్టుకోవచ్చనే ధైర్యం బిల్డర్లకు ఎక్కడి నుంచి వస్తోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వెళ్లినా స్పందన లేకపోవడం వెనుక పెద్ద స్థాయి అవినీతి ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. **ఏసీపీ, డిప్యూటీ కమిషనర్ మౌనం వెనుక వాటాల వ్యవహారమా.?** మంగళ హాట్ లోని ప్రకాష్ టాకీస్ దగ్గర భారీ స్థాయిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న వ్యవహారంలో ఉన్నతాధికారుల పాత్రపైనా స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. "సెక్షన్ ఆఫీసర్ మహేందర్ స్థాయిలో ఇంత భారీ అక్రమాలు జరిగితే ఉన్నతాధికారులకు తెలియకుండా ఎలా ఉంటుంది.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా ఏసీపీ, డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారులకు కూడా వాటాలు అందుతున్నాయా.? అందుకే చర్యలు తీసుకోవడం లేదా.? మరి గోల్కొండ జోనల్ కమిషనర్ ఉదయ్ కుమార్ కూడా ఎందుకు మౌనంగా ఉన్నారు.? అనే చర్చ స్థానికులలో జోరుగా సాగుతోంది. అక్రమ నిర్మాణాలపై మీడియా కథనాలు వస్తున్నా, ఫిర్యాదులు అందుతున్నా క్షేత్ర స్థాయిలో అధికారులు వెళ్లి పరిశీలించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. టౌన్ ప్లానింగ్ అధికారులు "చూసీ చూడనట్లు వ్యవహరించడం వెనుక కారణమేంటి.?" అని ప్రజలు నిలదీస్తున్నారు. అక్రమ సెల్లార్లు, అక్రమ అంతస్తులు, అక్రమంగా గోదాములలో **భవిష్యత్తులో ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిది.?** ఇరుకైన గల్లీలు, పార్కింగ్ సౌకర్యం లేకుండా నిర్మిస్తున్న అత్యంత భారీ భవనాలు భవిష్యత్తులో పెను ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా అక్రమ సెల్లార్లలో గోదాములు నిర్వహిస్తే అగ్నిప్రమాదాల సమయంలో ఫైర్ ఇంజన్లు కూడా లోపలికి వెళ్లలేని పరిస్థితి, ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి కమిషనర్, ఉన్నతాధికారులు స్పందించి గోషామహల్ సర్కిల్–30 పరిధిలో జరిగిన అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఈ ప్రాంతం అక్రమ నిర్మాణాల కేంద్రంగా పూర్తిస్థాయిలో మారిపోతుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# పదవ తరగతి పరీక్షల్లో గుర్తుర్ మోడల్ స్కూల్‌కు అరుదైన గౌరవం దక్కింది

**- తొర్రూర్ డివిజన్లో ఇద్దరు విద్యార్థినీలు 575 మార్కులతో విజయకేతనం ఎగరేశారు**

**- ప్రత్యేక అభినందనలు తెలిపిన ఎంఈఓ బుచ్చయ్య.**

**- మండలానికి మంచి పేరు తెచ్చారు సర్పంచ్ కవితా బాలకృష్ణ.**

**గుర్తూరు మోడల్ పాఠశాలలోవేసవి క్రీడలను ప్రారంభించిన సర్పంచ్ వి. కవిత బాలకృష్ణ**











**తొర్రూరు ప్రతినిధి, మే 11(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహబూబాబాద్ జిల్లా తోరూర్ మండలంలోని గుర్తుర్ మోడల్ పాఠశాలలో సోమవారం వేసవి క్రీడలను గ్రామ సర్పంచ్ కవిత బాలకృష్ణ, ఎంఈఓ బుచ్చయ్యలు ప్రారంభించారు. తొర్రూరు డివిజన్లోని పదవ తరగతి పరీక్షలు నిర్వహించిన విద్యార్థులుగుర్తుర్ మోడల్ స్కూల్ పేరు నిలిచేలా ఇద్దరు విద్యార్థులు మను శ్రీ, కావ్య శ్రీ 575 మార్పులను సాధించిన ఘనత వీరికి దక్కిన దని మండలంలో పాఠశాల పేరు నిలబెట్టినందుకు వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. వేసవి సెలవులు లలో యువత ఇంటి వద్దనే సెల్ఫోన్లను చూసుకుంటూ కాలక్షేపం చేసి ఆరోగ్యాన్ని పాడు చేసుకునే విధంగా చెడు అలవాట్లకు బానిసలు కాకుండా ఉండేందుకు ప్రభుత్వ ఆదేశాలను సారం పాఠశాలలో వేసవి క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థిని విద్యార్థులు ఉదయం పాఠశాలకు వచ్చి క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాలు అల్లికలు పలు కార్యక్రమాలు ఉన్నాయని వీటిని ఉపయోగించుకోవాలని ఉపాధ్యాయులు తెలిపారు. ముఖ్యఅతిథిగా వచ్చిన గ్రామ సర్పంచ్ కవిత బాలకృష్ణ ప్రసంగిస్తూ పాఠశాలల విద్యార్థులు చక్కని విద్యను నేర్చుకుంటూ ఉన్నత చదువులకు ఎదిగే విధంగా చూడాలని వేసవికాలంలో అనవసరంగా సెల్ఫోన్లను చూసుకుంటూ జీవితాలను చెడు మార్గంగా వెళ్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా వారిపైనే ఉందని పాఠశాలలో క్రీడలను ప్రారంభించినందుకు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు .ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులు పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. పాఠశాలలో వసతులు సరిగా లేవని ఉపాధ్యాయులు వారి దృష్టికి తీసుకుపోగా పాఠశాలలో విద్యార్థులకు వసతులు సరిగా లేకపోవడం ఇబ్బందికరంగా ఉందని ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సదుపాయాలు కల్పించే విధంగా చూస్తామని అన్నారు. తొర్రూర్ మండల ఎంఈఓ బుచ్చయ్య ప్రసంగిస్తూ పాఠశాలలో ఏర్పాటుచేసిన క్రీడలు విద్యార్థులు విద్యార్థులకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తుందని ఈ పాఠశాల విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ పాఠశాల గదులు సరిగా లేకపోవడం విద్యార్థులు పడుతున్న అవస్థలను చూడలేకపోతున్నామని వీటితోపాటు బస్సులు కూడా సరిగా లేక అవస్థలు ఎదుర్కొంటున్నారని బస్ డిపో మేనేజర్ పద్మావతి దృష్టికి తీసుకెళ్లి వచ్చే పాఠశాల ప్రారంభానికి మరో అదనపు బస్సులు ఏర్పాటు చేసే విధంగా చూస్తామని అన్నారు. విద్యార్థులకు ఏర్పాటుచేసిన క్లాస్ రూంలో తలుపులు, కిటికీలు లేనందున సిబ్బంది ఉందని అలాగే మూడు గదులకు గోడలు నిర్మించకపోవడం తో అనేక అవస్థలు ఎదుర్కొంటున్న విషయాన్ని తన దృష్టికి వచ్చిందని ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సరైన సదుపాయాలు ఏర్పాటు చేసే విధంగా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థిని, విద్యార్థులు వీరితోపాటు పాఠశాల ఉపాధ్యాయులు హాజరయ్యారు.

# నేడు గుర్తుర్ గ్రామపంచాయతీ ప్రాంతంలో సీసీ కెమెరా ఏర్పాటు

**- గ్రామంలో 5 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపిన గ్రామ సర్పంచ్**



**తొర్రూరు ప్రతినిధి ,మే 11(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలంలోని గుర్తుర్ గ్రామపంచాయతీలో ఐదు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు గ్రామ సర్పంచ్ వి .కవిత బాలకృష్ణ వెల్లడించారు. ప్రస్తుతం ఒకటి మాత్రం ప్రధాన రహదారి బస్టాండ్లో గత నాలుగు రోజుల క్రితం పోలీసుల పర్యవేక్షణలో ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సీసీ కెమెరాలు మొత్తం గ్రామపంచాయతీ నిధుల నుండి మంజూరు చేయడం జరిగినది అన్నారు. గ్రామంలో 5 సీసీ కెమెరాలు గ్రామపంచాయతీ కార్యాలయం ప్రధాన కూడళ్ల వద్ద అలాగే ఎస్సీ కాలనీ ప్రాంతంలో మరొకటి పాఠశాల క్రీడామైదానం ప్రాంతంలో మరొకటి గ్రామ శివారు రావణ్ బండ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. ఒక సీసీ కెమెరా 100 మందిపోలీసుల తో సమానం అని గ్రామంలోకి గుర్తుతెలియని ఎవరైనా వ్యక్తులువస్తే అలాగే ప్రమాదాలు జరిగిన గుర్తించేందుకు వీలు కలుగుతుందని అన్నారు . గ్రామంలోని వాహనదారులు ద్విచక్ర వాహనాలను తమ పిల్లలకు మైనర్లకు ఇవ్వకూడదని సూచించారు. వారు నడిపే విధానం సరిగా లేకపోవడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నామని పేర్కొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుడు ఎడ్ల జోగిరెడ్డి మృతి పట్ల తీవ్ర విషాదం వ్యక్తం చేసిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం

**మానకొండూరు మే 11(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మానకొండూరు నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ జెడ్పీటీసీ, ఎంపీటీసీ, తెలంగాణ ఉద్యమకారుడు ఎడ్ల జోగిరెడ్డి అకాల మరణం పట్ల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఓరుగంటి ఆనంద్ మరియు రాష్ట్ర కమిటీ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తిమ్మాపూర్ ప్రాంతానికి చెందిన ఎడ్ల జోగిరెడ్డి ప్రజా సేవకు అంకితభావంతో పని చేసి గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండేవారు. సహాయస్ఫూర్తి, మంచి మనసుతో ప్రజల మధ్య విశేష గౌరవాన్ని పొందారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తిమ్మాపూర్ మండల పరిధిలో తెలంగాణ ఆవశ్యకతను ప్రజలకు వివరించి అనేక మందిని ఉద్యమం వైపు మళ్లించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు ముందుగా స్పందించే వ్యక్తిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రజల హక్కుల కోసం పోరాడిన నిజమైన ఉద్యమకారుడిగా ఆయన పేరు నిలిచిపోతుంది. "మా ఆత్మీయ మిత్రుడు, ప్రజల మనిషి ఎడ్ల జోగిరెడ్డి ఇక లేరనే వార్త మాకు ఎంతో దుఃఖాన్ని కలిగించింది. ఆయన కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాం" అని రాష్ట్ర అధ్యక్షులు ఓరుగంటి ఆనంద్ మరియు రాష్ట్ర కమిటీ సభ్యులు తెలిపారు.



# గురుకులాల కాంట్రాక్ట్ జీవో 17ను రద్దు చేయాలి

**బహుజన కాంట్రాక్టర్లను ఆదుకోవాలి..!**

**గురుకుల ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ కాంట్రాక్టు అసోసియేషన్ జిల్లా నాయకులు దారా చిరంజీవి**

**పరాయి రాష్ట్ర సంస్థలకు అప్పగించి స్థానిక యువత పొట్ట కొట్టకండి**






**ఖమ్మం ప్రతినిధి, మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** గురుకులాల్లోని పూర్వ విద్యార్థులుగా ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాక, గత 15 ఏండ్లుగా గురుకులాల్లో చిన్న చిన్న కాంట్రాక్టర్లుగా గురుకులాల్లో పనిచేస్తూ తమ జీవితాలను కొనసాగిస్తున్నామని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్ట్ అసోసియేషన్ జిల్లా నాయకులు దారా చిరంజీవి అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడడంలో తమ వంతు పాత్ర పోషించామని అన్నారు. కానీ గురుకుల విద్యా సంస్థల్లోని కాంట్రాక్ట్ పనుల కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 17 మా పాలిట మృత్యుపాశంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. మా జీవితాలకు గొడ్డలి మెట్టుగా మారిన జీవో నెంబర్ 17ను రద్దు వెంటనే చేయాలని సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టి ప్రజావాణిలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... తెలంగాణ గడ్డపై పుట్టి, ఇక్కడే చదువుకుని, చిన్నపాటి కాంట్రాక్టు పనులతో తమ ఉమ్మడి కుటుంబాలను పోషించుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతపై ప్రభుత్వం పిడుగులాంటి వార్త మోపిందని వాపోయారు. ఏళ్ల తరబడి నమ్ముకున్న వృత్తిని దూరం చేస్తూ, గుజరాత్ వంటి రాష్ట్రాల నుంచి వచ్చిన పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలకు (మఫ్ఫత్ లాల్ వంటి సంస్థలకు) రెడ్ కార్పెట్ వేయడం వెనుక ఉన్న మర్మమేమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఓట్లేసి గెలిపించిన స్థానిక బిడ్డల నోటి కాడ కూడు తీసి, పొరుగు రాష్ట్రాల సంస్థల గల్లా పెట్టెలు నింపడం సామాజిక న్యాయమేనా? అని ప్రశ్నించారు. చేవెళ్ల - కామారెడ్డి డిక్లరేషన్ హామీలు ఏమైనవని? నిలదీశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన చేవెళ్ల - కామారెడ్డి డిక్లరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని కాంట్రాక్ట్ అసోసియేషన్ నేతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న పద్ధతిలోనే స్థానిక బహుజన యువతకు టెండర్లలో ప్రాధాన్యత ఇవ్వాలని, వారి ఉపాధిని కాపాడాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం కలెక్టరేట్ ముందు గొంతెత్తారు. "మేము అడుగుతున్నది కేవలం పని మాత్రమే కాదు, మా ఆత్మగౌరవాన్ని, మా బతుకుదెరువును" అని వారు నినదించారు. ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకుంటే, ప్రజా సంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. స్థానిక కాంట్రాక్టర్ల ఉపాధిని హరించే జీవో 17ను తక్షణమే రద్దు చేయాలని, గుజరాత్ కంపెనీలకు అప్పగించిన టెండర్లను రద్దు చేసి, తెలంగాణ బిడ్డలకే పనులు కేటాయించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు/అవకాశాలు కల్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఒక యువకుడు కాంట్రాక్టు పొందితే, అతని కింద పదుల సంఖ్యలో స్థానిక నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు. కానీ, పనులన్నీ కార్పొరేట్ శక్తుల పరమైతే స్థానిక యువత మళ్లీ కూలీలుగా మారాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇది కేవలం టెండర్ల విషయం కాదు, వేలాది బహుజన కుటుంబాల మనుగడకు సంబంధించిన అంశం అన్నారు. ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి, స్థానిక యువత ఆవేదనను అర్థం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేతలు దారా చిరంజీవి, రత్తయ్య, సుధాకర్, మేకల హనుమంతరావు, గోపాలరావు, జయరాజు, లాలయ్య, రత్నాకర్, వై వెంకటేశ్వర్లు, రాజు, మధు, రాజేష్, సంతోష్, సురేష్, బాలరాజు, పుల్లయ్య, నర్సయ్య, జర్పుల ప్రసాద్, మేకల క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బేటి బచావో అంటే ఇదేనా...?: టిఆర్ఎస్ నాయకుల సూటి ప్రశ్న




**మేడిపల్లి, మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బిజెపి నాయకులు దేశం కోసం ధర్మం కోసం పనిచేస్తామని భేటీ బచావో భేటీ పడావో అంటూ గొప్ప గొప్ప మాటలు చెప్తారు కానీ వారి కుటుంబ సభ్యులే అమ్మాయిల పాలిట శాపంగా మారుతున్నారని పీర్జాదిగూడ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మల ఆరోపించారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ పై అత్యాచార ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ.. ఎంపీ బండి సంజయ్ కొడుకు భగీరథ పై మైనర్ బాలిక ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయడంలో పోలీసులు తీవ్ర నిర్లక్ష్యం చేశారని, మూడు రోజుల తర్వాత ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినప్పటికీ చిన్నచిన్న సెక్షన్లను చూపి అతన్ని కేసు నుంచి బయటపడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. బండి భగీరథ కాలేజీ సమయం నుంచే విచ్చలవిడిగా ప్రవర్తిస్తూ తోటి విద్యార్థుల పట్టా యువతుల పట్ల దురుసుగా ప్రవర్తించాడని అతనిపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మం గురించి గొప్పగా చెప్పే బండి సంజయ్ తన కొడుకు చేస్తున్న ఆకృత్యాల గురించి సమాధానం చెప్పాలని, నిందితున్ని కాపాడడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎందుకు ప్రయత్నం చేస్తున్నారో జవాబు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. పోలీసులు ఇప్పటికైనా భగీరథను అరెస్టు చేయాలని లేకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని బాధితురాలికి అండగా నిలుస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు హరి శంకర్ రెడ్డి, రఘుపతి, మహేష్, పోచయ్య, పార్టీ నాయకులు రఘువర్ధన్ మనోరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓం శ్రీ రుద్వేద్ జన్మదిన వేడుకల్లో ఆనందోత్సాహం

**• మామునూర్ ఏసీపి వెంకటేష్ హాజరు చిన్నారికి ఆశీస్సులు**



**నరసింహులపేట ,మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నరసింహులపేట మండల కేంద్రంలోని పెద్ద నాగారం గ్రామంలో కేకేఎస్ ఫంక్షన్ హాల్లో కానిస్టేబుల్ తాడూరి కార్తీక్‌హర్షిత దంపతుల కనిష్ట పుత్రుడు ఓం శ్రీ రుద్వేద్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మామునూరు ఏసీబీ వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు కుటుంబాలకు ఆనందానికి ప్రతీకలని, వారిలో మంచి సంస్కారం, క్రమశిక్షణ పెంపొందించే బాధ్యత తల్లిదండ్రులదేనని అన్నారు. చిన్నారి ఓం శ్రీ రుద్వేద్ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. వేడుకల్లో బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొని చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# సత్వర పనులకై ప్రజాదర్బార్

**ఈ నెల 13న జీళ్ళచెర్వు.. 14న ఏదులాపురం, రామన్నపేట క్లస్టర్ పరిధిలో ప్రజాదర్బార్**

**వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి**

**ఖమ్మం ప్రతినిధి, మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సామాన్యుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలనే సంకల్పంతో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేపట్టిన 'ప్రజా దర్బార్' కార్యక్రమం పాలేరు నియోజకవర్గంలో విజయవంతంగా జరుగుతోంది. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా, అధికారులే నేరుగా ప్రజల వద్దకు వచ్చి వినతులు స్వీకరిస్తుండటంతో జనం నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ నెల 13న బుధవారం, 14న గురువారం మూడు ప్రధాన క్లస్టర్ల పరిధిలో నిర్వహించనున్న ప్రజాదర్బార్ల వివరాలను మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి వెల్లడించారు.

**బుధవారం జీళ్ళచెర్వులో..**

ఈ నెల 13న బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు కూసుమంచి మండలం జీళ్ళచెర్వు క్లస్టర్ పరిధిలో ప్రజా దర్బార్ నిర్వహించనున్నారు. గ్రామంలోని స్టార్ గార్డెన్స్ ఎదురుగా ఉన్న మైదానంలో జరిగే ఈ దర్బార్‌కు జీళ్ళచెర్వుతో పాటు పోచారం, తురకగూడెం, నేలపట్ల, అగ్రహారం, కోక్యా తండా, లోక్యా తండా, ముత్యాలగూడెం, చేగొమ్మ, ధర్మతండా, మునిగేపల్లి, కేశవాపురం, కిష్టాపురం గ్రామాలకు చెందిన ప్రజలు హాజరుకావచ్చు.

**గురువారం ఉదయం ఏదులాపురంలో... మధ్యాహ్నం రామన్నపేటలో..**

గురువారం ఉదయం 8 గంటలకు ఏదులాపురం మున్సిపాలిటీ క్లస్టర్-1 పరిధిలోని 15 వార్డుల (1,2,3,4,5,18,19,20,21,22,23,24,30,31,32) ప్రజల కోసం 22వ వార్డు సత్యనారాయణపురంలోని టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం ఉంటుంది. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు రామన్నపేట క్లస్టర్ పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో దర్బార్ నిర్వహిస్తారు. 1వ డివిజన్ కైకొండాయిగూడెం, 59వ డివిజన్ దానవాయిగూడెం, 60వ డివిజన్ రామన్నపేట ప్రజలు ఇక్కడ తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చు.

**వేదికలపైనే పరిష్కారం..!**

ప్రధానంగా భూ సమస్యలు,



ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కార దిశగా తక్షణ చర్యలు చేపట్టాలని ఇప్పటికే మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు ఈ వేదికలపై అందుబాటులో ఉంటారు. ప్రజల ప్రతి విన్నపాన్ని నేరుగా పర్యవేక్షిస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దయాకర్ రెడ్డి కోరారు.

# మాదక ద్రవ్యాలను అరికట్టడంపై డాక్టర్ సామ రవీందర్ రెడ్డి పరిశోధన

**• పరిశోధనకు ముందుమాట రాస్తానన్న డీజీపీ సీవీ. ఆనంద్ • డీజీపీ సీవీ. ఆనంద్ కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపిన ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్ రెడ్డి**



**షాద్ నగర్,మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్రాన్ని డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా మారుస్తానన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో మాదక ద్రవ్యాలు లేకుండా, ఉధృతంగా మాదక ద్రవ్యాల నిరోధక కార్యక్రమాలు చేస్తున్న తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ను కలిసి మీ జీవితం ఎంతో మందికి ఆదర్శమని అభినందిస్తూ షాద్ నగర్ కు చెందిన శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థ శాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్ రెడ్డి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విదంగా మాదకద్రవ్యాల దుర్వినియోగం పై పరిశోధనకు ముందుకు వచ్చిన రవీందర్ రెడ్డిని డీజీపీ సీవీ ఆనంద్ అభినందించారు. అలాగే మాదక ద్రవ్యాల ను అరికట్టడం పై డాక్టర్ రవీందర్ రెడ్డి చేస్తున్న పరిశోధన అంశానికి ముందుమాట రాస్తానని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపినట్లు సామ రవీందర్ రెడ్డి తెలిపారు. డ్రగ్స్ వాడడానికి వ్యతిరేకంగా డిపార్ట్మెంట్ తో కలిసి పనిచేయాలనే అభిప్రాయం తెలిపినప్పుడు సివి ఆనంద్ సానుకూలంగా స్పందించారని సామ రవీందర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని డ్రగ్ ఫ్రీ రాష్ట్రంగా మారుస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకెళ్తున్న సందర్భంగా అదే అంశంపై పరిశోధన చేస్తూ పుస్తకం రాస్తూ ఉండడం తనకి ఎంతో సంతృప్తినిస్తుందని తన పరిశోధనలు పూర్తి చేసిన తర్వాత ప్రభుత్వానికి, సమర్పిస్తానని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ రెడ్డి ఆషాభావం వ్యక్తం చేశారు. తాను ఇప్పటికే సివిల్ సర్వీస్ వారికి ఇండియన్ ఎకనామిక్ పుస్తకం రాయడం ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించడం, అలాగే సామాజిక అంశాల మీద దృష్టి పెట్టి పరిశోధనలు చేస్తున్న డాక్టర్ రవీందర్ రెడ్డిని పలువురు విద్యావేత్తలు అభినందిస్తున్నారు.

# బండి సంజయ్ తనయుడిపై చర్యలేవి..?

**• కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ • చిన్నారి న్యాయ పోరాటంలో మౌనం ఎందుకు? • చట్టం ముందు అందరూ సమానమేనని నిరూపించాలని బీజేపీకి సవాల్**




**ఖమ్మం ప్రతినిధి, మే 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** దేశం కోసం, ధర్మం కోసం అంటూ గొప్పలు చెప్పుకునే భారతీయ జనతా పార్టీడ మైనర్ బాలికపై జరిగిన అత్యాచార ఆరోపణల విషయంలో ఎందుకు మౌనం పాటిస్తోందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తీవ్రంగా ప్రశ్నించారు. సోమవారం ఆయన మాట్లాడుతూడ ఒక అమాయక చిన్నారి జీవితాన్ని చిదిమేసేలా జరిగిన ఈ ఘటనలో బాధితురాలికి న్యాయం జరగాల్సిన సమయంలో అధికార ప్రభావం, రాజకీయ మౌనం కనిపించడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై వచ్చిన ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని, ఒక మైనర్ బాలికను స్నేహం పేరుతో నమ్మించి ఫామ్ హౌస్‌కు రప్పించి, కూల్ డ్రింక్స్‌లో మత్తు పదార్థాలు కలిపి అత్యాచారానికి పాల్పడ్డాడనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఇంతటి తీవ్రమైన ఆరోపణల నేపథ్యంలో కూడా బీజేపీ నాయకత్వం స్పందించకపోవడం సమాజానికి తప్పుడు సంకేతాలు పంపుతోందని విమర్శించారు. "సాధారణ కుటుంబానికి చెందిన వ్యక్తిపై ఇలాంటి ఆరోపణలు వచ్చినా వెంటనే అరెస్టులు, కఠిన చర్యలు తీసుకునే వ్యవస్థడ అధికార కుటుంబాలకు చెందిన వారిపై మాత్రం ఎందుకు మౌనం పాటిస్తోంది?" అని ప్రశ్నించారు. చట్టం బలహీనులపై మాత్రమే పనిచేస్తుందా అనే అనుమానం ప్రజల్లో కలుగుతోందన్నారు. హిందూ సంస్కృతి, మహిళల గౌరవం, భారతీయ విలువల గురించి నిరంతరం మాట్లాడే బీజేపీడ ఇప్పుడు ఒక చిన్నారి ఆవేదన విషయంలో నైతిక బాధ్యత చూపాలని ఆయన సూచించారు. "బాధితురాలు ఎవరి కుమార్తె కాదుడ సమాజం మొత్తం కూతురే. ఆమె కన్నీటి వెనుక ఉన్న బాధను రాజకీయ కోణంలో చూడకూడదు" అని భావోద్వేగంగా అన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ తన పదవిని ఉపయోగించి కేసు విచారణపై ప్రభావం చూపకుండా ఉం డాలంటే, నైతిక బాధ్యతతో మంత్రి పదవికి రాజీనామా చేసి విచారణకు సహ కరించాలని డిమాం డ్ చేశారు. అదే విధంగా బీజేపీ పార్టీ కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఆరోపణలు ఎదుర్కొంటున్న కుటుంబంపై చర్యలు తీసుకోవాలని కోరారు. "దేశం కోసం... ధర్మం కోసండ అని చెప్పే రాజకీయాలకు ఇదే నిజమైన పరీక్ష. అధికారాన్ని కాపాడటమా? లేక ఒక చిన్నారికి న్యాయం చేయడమా? అన్నది ప్రజలు గమనిస్తున్నారు" అని నూతి సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నారు. బాధితురాలికి పూర్తి రక్షణ కల్పించి, కేసును నిష్పక్షపాతంగా విచారించి, నిజానిజాలు వెలికి తీసి చట్టం ముందు ఎవరైనా సమానమేనని నిరూపించాలని ఆయన డిమాండ్ చేశారు.